
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 7 ఆగస్టు 2025



సర్దుబాటు ఎప్పుడో!



- ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో 60కి పైగా ఎయిడెడ్ పోస్టులు
- అడ్మిషన్లు లేక ఖాళీగా ఉపాధ్యాయులు
- రూ.వేలల్లో జీతాలు.. రియల్టర్లు, బిల్డర్స్‌గా అవతారం
- కదలని సబ్జెక్ట్ టీచర్లుగా సర్దుబాటు ప్రతిపాదన

సబ్జెక్టు టీచర్లు లేక సతమతం అవుతున్న పాఠశాలలు ఒక వైపు.. మరో వైపు ఎయిడెడ్ పాఠశాలల్లో సంతకాలు పెట్టి వెళ్తూ రూ.వేలల్లో ప్రభుత్వ జీతం తీసుకుని ఖాళీగా ఉంటున్న ఉపాధ్యాయులు కొందరు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 మందికి పైగా ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు నెలల తరబడి ఖాళీగా ఉంటూ జీతాలు తీసుకుంటున్నారు. వీరిని సర్దుబాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నా.. అమలు కావడం లేదు. ఫలితంగా ప్రభుత్వం రూ.లక్షల్లో జీతాలు చెల్లిస్తూ.. వారిని బోధనకు దూరం చేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

గుంటూరు (విద్య) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, కొల్లూరు, బాపట్ల, రేపల్లె, ఫిరంగిపురం, అమరావతి, గుంటూరు ఇలా అనేక మండలాల్లో యాజ మాన్యాల ఆధ్వర్యంలో పాఠశాలలు నడుస్తు న్నాయి. ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు సక్రమంగా లేకపోవడంతో ఒక్కో పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారు. ఆయా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యా శాఖ ఈ ఏడాది జనవరిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మండలాల వారీగా ఉన్న ఎయిడెడ్ పాఠశా లల్లో ఖాళీల సంఖ్యను తెలియజేయాలని కోరుతూ ఎంఈఓలకు, డిప్యూటీ ఈఓలకు విద్యాశాఖ నుంచి లేఖలు వెళ్లాయి. దీంతో వెంటనే మండల స్థాయిలో ఉన్న పా ఠశాలలను పరిశీలించి ఎంఈఓలు ఖాళీల వివరాలను సేకరించారు. దాదాపు ఉమ్మడి జిల్లాలో 60 పైగా ఖాళీలు ఉన్నట్లు తేలింది. ఇక్కడ పనిచేస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులను సమీపంలోని ఉన్నత పాఠశాలలు లేదా ప్రాథమిక పాఠశాలలో సర్దుబాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఈలోగా బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టారు. బదిలీల ప్రక్రియ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా.. సర్దుబాటు ప్రక్రియపై విద్యాశాఖ దృష్టి సారించడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రూ.లక్షల్లో జీతాలు

యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోంది. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున రూ.70 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు ఇస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు నెలకు రూ.1.20 కోట్ల వరకు ఉపాధ్యాయులకు జీతాలు రూపంలో ప్రభుత్వం భరిస్తోంది. కానీ, బోధన పరంగా వారి నుంచి ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. అడ్మిషన్లు లేని పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వచ్చి హాజరు వేయించుకుని వెళ్తున్నారు. ఇందులో చాలా మంది రియల్టర్లు, బిల్డర్లుగా మారారు. మరి కొందరు ప్రయివేటు చిట్స్ నిర్వహణలో మునిగిపోయారన్న ఆరోపణలున్నాయి. వీరిని సబ్జెక్టు టీచర్లు అవసరమైన పాఠశాలలకు బదిలీ చేసి.. బోధన వైపు మళ్లించాలన్న విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

కష్టనష్టాల కలనేత.. చేనేత!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత దినోత్సవాన్ని ఎంతో అట్టహాసంగా జరుపుతున్నాయి. ఇలాంటి చేనేత దినోత్సవాలు ఇప్పటికి పది గడిచి పోగా.. ప్రస్తుతం జరుపుకుంటున్నది పదకొండోది. అయితే ఈ పదేళ్లలో చేనేత రంగం ఏమైనా మెరుగు పడిందా? నేతన్నలు ఏ మేరకైనా పురోగతి సాధించారా? అంటే.. మాట వరసకైనా అవునన లేని పరిస్థితి. నిజం చెప్పాలంటే వారి పరిస్థితి ఈ దశాబ్ద కాలంలో మరింత దిగజారింది. దేశంలోనే అతిపెద్ద స్వయం ఉపాధి రంగమైన చేనేత పరిశ్రమ ఎందుకింత దీనావస్థలో ఉంది. రెక్కాడితేగాని డొక్కాడని నేతన్నల జీవన పరిస్థితి ఎందుకు అంతకంతకూ దిగజారుతోంది? అనేది ఇటు సమాజాన్ని, అటు ప్రభుత్వాన్ని సవాలు చేస్తున్న అంశం.



- ఆసరా కోసం ఆశగా చూస్తున్న నేతన్నలు
- పవర్ లూమ్ ధాటికి కొన ఊపిరిలో చేతిమగ్గం
- దినోత్సవాలు కాదు.. చేయూత కావాలంటున్న కష్టజీవులు
- చేతినిండా పని, తగిన మజూరీ ఉంటేనే ఊరట
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

8

మూలాల్లోకి వెళ్లిన లోకేశ్..

చేనేత దినోత్సవాన్ని గురువారం సీఎం చంద్రబాబు మంగళగిరిలో నిర్వహిస్తున్నారు. నేతన్నల్లో ఎన్నో ఆశలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో అధికారం లేకపోయినా.. మంత్రి లోకేశ్ చేనేత సంరక్షణకు వినూత్న యత్నం చేశారు. సొంత నిధులతో నేతన్నలకు అధునాతన యంత్ర సామగ్రిని అందించారు. మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్‌షిప్ తీసుకొచ్చి.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది.

పశ్చిమలో భారీ వర్షం

- ప్రధాన రహదారులపైకి ఉప్పొంగిన మురుగు
- తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు, వాహన దారులు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి అరగంటకు పైగా కుండపోతగా పడింది. డ్రెయినేజీల్లోని నీరు ఉప్పొంగడంతో వికాస్‌నగర్ నుంచి సిద్దార్థ గార్డెన్స్ వరకు జలమయమైంది. గార్డెన్స్, లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, పట్టాభిపురం నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు రోడ్ల పైకి వరద నీరు మోకాలి లోతులో ప్రవహించింది. దాంతో వాహన దారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వెలిసిన తర్వాత దుకాణాల ముందు.. మురుగు పేరుకుపోవడంతో దానిని తొలగించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సూర్యదేవర కల్యాణ మండపంలో ఒక జూనియర్ కళాశాల ఫెస్టు జరగగా.. వరదనీరు కారణంగా గంటన్నర పాటు విద్యార్థినులు బయటకు అడుగు పెట్టలేకపోయారు. ఆయా ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లున్నా వాటిపై ఆక్రమణలు కారణంగా మురుగు పేరు కుపోయి ఎక్కడికక్కడ ప్రవాహం స్తంభించిపోతోంది. ప్రతి ఆరు నెలలకు భారీగా ఆస్తి పన్ను వసూలు చేసే నగరపాలక సంస్థ ఈ లోతట్టు ప్రాంతాలల్లో డ్రెయినేజీ వ్యవస్థని మెరుగు పరిచేందుకు దృష్టి పెట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, నగరం లోని ఇతర ప్రాంతాల్లో వర్షం కురవకపోవడం కొసమెరుపు.



స్తంభాలగరువులోని రాజ్యలక్ష్మినగర్‌లో..



రింగ్ రోడ్డు సిద్ధార్థ గార్డెన్స్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు ప్రవాహం

13 అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు ఆహ్వానం

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ గుంటూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 13 అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు ప్రాజెక్టు అధికారి బి.అరుణ నోటిఫికేషన్ జారీ చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎస్సీ రిజర్వ్ 3, ఎస్టీ, బీసీ-ఎ, ఓసీ కేటగిరీలకు ఒక్కొక్కటి చొప్పున ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఓసీ కేటగిరీలో 3, బీసీ-బీ, ఈ కేటగిరీల్లో ఒక్కొక్కటి, ఎస్సీ రిజర్వ్‌లో ఒకటి, ఓసీ డీడబ్ల్యూ కేటగిరీలో ఒకటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అభ్యర్థులు ధ్రువ పత్రాలతో దరఖాస్తులను ఈ నెల 14 సాయంత్రం 5 గంటలలోపు ఏటీ అగ్రహారం ఆరోలైన్ హనుమాన్ నగర్‌లో ఉన్న శ్రీలక్ష్మి నిలయంలోని అర్బన్ కార్యాలయంలో అందజేయాలని ప్రాజెక్టు అధికారి తెలిపారు. అభ్యర్థులు స్థానికులై ఉండాలని, 21 నుంచి 35 ఏళ్లలోపు వయసువారై ఉండాలని, ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు.

మోతడకలో పికిల్ హబ్

- రూ.20 కోట్లతో ఏర్పాటు
- పరిశీలించిన అధికారుల బృందం

8



పూర్తయితే.. రాచ మార్గాలే..

- రూ. 930 కోట్లు మంజూరు చేసిన కేంద్ర జాతీయ రహదారుల శాఖ
- ఇప్పటికే వర్చువల్ విధానంలో పునాదిరాయి వేసిన మంత్రి గడ్కరీ
- వేగవంతంగా పనులు జరిగితేనే ప్రజలకు మేలు

ఇక వివరాలన్నీ పక్కా



- స్వయం సహాయక సంఘాలకు లోకోస్ యాప్

8

భరోసా కోసం వెళ్తే.. బండారం బయట పడింది

- అక్క ఆస్తిని కాజేసిన తమ్ముడు,మేనల్లుడు
- నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి విక్రయించిన వైనం
- రైతు భరోసా సొమ్ము పడక పోవడంతో బయటపడ్డ బాగోతం

8, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

మంగళగిరిలో సీఎం పర్యటన సాగేదిలా..

6


రాజధానిలో.. దళారుల దందా



- కురగల్లుకు చెందిన ఒక అసైన్డ్ రైతు ప్రభుత్వం ఇచ్చిన 500 గజాల రిటర్న బుల్ ప్లాటును ఇటీవల బేరం పెట్టాడు. అక్కడ భూమి విలువ గజం రూ.35 నుంచి రూ.40వేల వరకూ ఉంది. అయితే ఆ ప్లాటుకు అసైన్డ్ వంక పెట్టి గజం రూ. 24 వేలకు కొన్నారు. దీంతో ఆ రైతు గజానికి రూ.10వేల వంతున.. మొత్తం 500 గజాలకు రూ.50 లక్షల వరకూ నష్ట పోయాడు.

- నీరుకొండ గ్రామానికి చెందిన మరొక రైతు తన రిటర్నబుల్ ప్లాటును బేరం పెట్టగా. తొలుత గజం రూ.45వేలకు కొనేందుకు సిద్ధమయ్యారు. అయితే స్టాంపు పేపర్లలో భూమి స్వభావం అసైన్డ్ అని ఉండడంతో గజానికి రూ.8 వేలు తక్కువకు అడిగారు. దీంతో ఆ రైతు భూమి అమ్మేందుకు నిరాకరించాడు.





- కారుచౌకగా స్థలాలు కాజేస్తున్న రియల్టర్లు
- రిటర్నబుల్ ప్లాట్లు.. అసైన్డ్ అంటూ ప్రచారం
- గజానికి రూ.10 నుంచి 20 వేల ధర తగ్గింపు
- సీఎం దృష్టికి తీసుకువెళ్లిన రాజధాని రైతులు
- అయినా ఆగని దళారుల దోపిడీ..

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అసైన్డ్ రైతుల రిటర్నబుల్ ప్లాట్లపై దళారుల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధానిలో భూముల రేట్లు విపరీతంగా పెరిగినప్పటికీ.. అసైన్డ్ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ల ధరలు మాత్రం పాతాళంలోనే ఉన్నాయి. దళారులంతా ఒక్కటై (మిగతా 6వ పేజీలో)

48 గంటల్లో అనధికార నిర్మాణాలు స్వచ్ఛందంగా తొలగించాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలు, లే అవుట్స్, హోర్డింగ్స్, ట్యాప్‌లు 48 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే జీఎంసీ సిబ్బందే తొలగించి.. అందుకు అయిన ఖర్చుతో పాటు అపరాధ రుసుం కూడా బాధ్యులకు విధిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం శారదా కాలనీ, సంజీవయ్య నగర్, కేవీపీ కాలనీ తదితర ప్రాం తాల్లో ఆయన పర్యటించారు. మిర్చి యార్డ్ పరిసరాల్లో మిర్చి తొడాలు తీసే గోదాములను కార్మిక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. 14 మంది బాల కార్మికులను గుర్తించి, వారిని పాఠశాలలో చేర్పించాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కార్మికశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



బాల కార్మికులకు కార్మిక శాఖ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ ఇస్తున్న కమిషనర్

రూ.36 కోట్ల సర్వీస్ చార్జి బకాయి

జీఎంసీ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సర్వీస్ చార్జీల బకాయిపై కమిషనర్ శ్రీనివాసులు తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే, పోస్టల్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కం ట్యాక్స్, మిలటరీ, నెహ్రూ యువజన కేంద్రం, స్పైసెస్ బోర్డ్, సీటీఆర్ఐ స్టేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు 141 అసె స్మెంట్ల ద్వారా సుమారు రూ.36 కోట్లు సర్వీస్ చార్జీల బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపు కోసం రెవెన్యూ అధికారులను శాఖలవారీగా షెడ్యూల్ కేటాయించాలని అదనపు కమిషనర్ తెలిపారు. అవసరమైన వాటిని రీ అసెస్ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.బాలునాయక్, డిప్యూటీ కమిషనర్ ఎ.గాయత్రిదేవి, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ ఎస్పీ సతీష్‌కుమార్

నేడు వీవర్‌శాలలో జాతీయ చేనేత దినోత్సవం

- హాజరు కానున్న సీఎం చంద్రబాబు

మంగళగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఆటోనగర్ లోని వీవర్‌శాలలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాలు జరు గనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, వీవర్‌శాల వద్ద, చేనేత కుటుంబాలతో సమావేశమయ్యే ప్రజా వేదిక తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, డీఎస్పీలు, చేనేత జౌళి శాఖ జేడీ రాజారావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

మంగళగిరి సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరై ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. 38కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ, అవగాహన సామర్థ్యం ఆధారంగా 508 మందికి ఉద్యోగాలు లభించాయి. ఎంపికైన అభ్యర్థులు ఆయా కంపెనీల్లో రూ.15 వేల నుంచి రూ.40 వేల వేతనం పొందనున్నారు. జాబ్ మేళా అనంతరం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు, స్థానిక నేతలు అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు, ఉపాధి కల్పనాధికారి డి.దుర్గాబాయి, సీడప్ జేడీఎం రాంబాబు, టీడీపీ మంగళగిరి, దుగ్గిరాల మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో టీడీపీ నాయకులు

మొబైల్స్‌తో సమయాన్ని వృథా చేయొద్దు

◆ ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీ బీ రాజకుమారి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీ రాజకుమారి

వట్టిచెరుకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మొబైల్ ఫోన్‌లు, సోషల్ మీడియాపై ఆసక్తి చూపుతూ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, దీంతో విద్యపై దృష్టి తగ్గుతుందని ఏపీఎస్‌పీ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు బీ రాజకుమారి ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 2025 - 26 విద్యా సంవత్స రానికి బీటెక్ విద్యార్థులకు పరిచయ కార్యక్రమం బుధవారం కళాశాల ఆడిటోరియంలో వేడుకగా నిర్వహించుకున్నారు. తొలుత కళాశాల విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి రాజకుమారి ముఖ్యఅతిథిగా హాజరై సాంకేతిక పరిజ్ఞానం మంచిదే. కాని దానికి బానిసలుగా మారకుండా మన అభివృద్ధికి ఎలా ఉపయోగించుకోవాలో నేర్చు కోవాలన్నారు. తాను ఒక సాధారణ కుటుంబంలో పుట్టి క్రమశిక్షణ, నిబద్ధత, లక్ష్య సాధన ద్వారా ఐపీఎస్ అధికారిగా ఎదగటానికి దోహద పడ్డ విషయాలను రాజకుమారి వివరించారు. మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్ళు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులు నైపుణ్యాలు, విలువలు, పరిశోధన అభిరుచి ఆచరణాత్మక జ్ఞానం పొందే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కే వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జే అప్పారావు, డీన్ అడ్మిషన్స్ పీ రమేష్‌బాబు, డీన్ అకడమిక్ జంపని కిషోర్‌బాబు, వివిధ విభాగాల డీన్‌లు, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ మెంబర్లు, మొదటి సంవత్సర విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల

గుంటూరు మెడికల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ పథకంలో జిల్లాలో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డాట్స్ ప్లస్ టీబీ హెచ్‌ఐవీ సూపర్‌వైజర్, టీబీ సెంటర్ స్టాటిస్టికల్ అసిస్టెంట్, అకౌంటెంట్, టీబీ హెచ్‌వీ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పోస్టులకు నిరుడు డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చినట్లు వారు తెలిపారు. తాజాగా విడుదల చేసిన మెరిట్ జాబితాలో పేర్లపై అభ్యంతరాలు ఉన్న వారు ఆగస్టు ఎనిమిది నుంచి 13వ తేదీ లోపు తగిన ధ్రువ పత్రాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాతపూర్వకంగా అందజేయాలని వారు కోరారు. 13వ తేదీ తర్వాత అందే అభ్యర్థనలను స్వీకరించబోమని వారు వెల్లడించారు.

సంగీత, నృత్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు, డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో ప్రవేశానికి 2025-26 విద్యా సంవత్సరంకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వీ కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక, గాత్రము, వీణ, వయొలిన్, డోలు, మృందగము, కూచిపూడి నృత్యం, నాదస్వరము విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. వయోపరిమితి అవసరం లేదని, గృహిణులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఎవరైనా ఈ కోర్సులో చేరవచ్చని తెలిపారు. వివరాలకు 0863 223 4913 అనే నెంబర్లో సంప్రదించాలన్నారు.

భరోసా కోసం వెళ్తే.. బండారం బయట పడింది

- అక్క ఆస్తిని కాజేసిన తమ్ముడు,మేనల్లుడు
- నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి విక్రయించిన వైనం
- మేనత్త, పిన్ని ఆస్తులూ పలువురికి విక్రయం
- రైతు భరోసా సొమ్ముపడకపోవడంతో బయటపడ్డ బాగోతం
- వివరాలు వెల్లడించిన తెనాలి డీఎస్పీ


నిందితులను చూపుతూ వివరాలు తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ ఉమేష్, ఎస్‌ఐలు

తెనాలి రూరల్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): తోడబుట్టిన తమ్ముడు, మేనల్లుడు కలిసి అక్క ఆస్తిని కాజేసి అమ్మకం చేసిన ఉదంతాన్ని రూరల్ పోలీసులు బట్ట బయలు చేశారు. బుధవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిందితులను చూపుతూ కేసు వివరాలను డీఎస్పీ జనార్ధన్‌రావు మీడియాకు వివరించారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన కోలపల్లి సత్యనారాయణ, అతడి కుమారుడు కోలపల్లి నరేష్‌లు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. సత్యనారాయణ అక్క గాజుల బసవపూర్ణకుమారి, భర్త, వారి ఇరువురు కుమారులు అదే గ్రామంలో నివాసముంటున్నారు. కాగా పూర్ణకుమారి చిన్నకుమారుడు వివాహం కాకముందే మృతి చనిపోయాడు. పెద్దకుమారుడికి వివాహం జరిగి ఇద్దరు పిల్లలుపుట్టిన తరువాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2024లో భర్తసైతం మృతి చెందడటంతో పెద్దకుమారుడి పిల్లలతో కలిసి పూర్ణకుమారి ఉంటుంది. వీరికి అదే గ్రామంలో 2ఎ కరాల మాగాణిభూమి, 17 సెంట్లు స్థలం ఉంది. ఐతే వరుసకు తమ్ముడైన సత్యనారాయణ, అతడి కుమారుడు నరేష్‌లు అక్క పొలం, స్థలంపై కన్నేశారు. దీనికి ఓ డాక్యుమెంట్ రైటర్ తిరుపతి మరియదాసు, మీ సేవా కేంద్రానికి చెందిన దాసరి శివన్నారాయణలతో కలిసి విషయాన్ని తెలిపారు. దీంతో విజయనగరం జిల్లాలోని బసవపాలెం పంచాయతీ పరిధిలో బసవకుమారి, ఆమె భర్త కుటుంబం నివసిస్తున్నట్లు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించారు. కొన్ని రోజులకు వారి కుటుంబసభ్యుల జాబితాలో వీరి పేర్లు కూడా చేర్చుకున్నారు. అక్క, బావ చినిపోయినట్లు దొంగ మరణ ధృవీకరణ పత్రాలు సృష్టించి ఫ్యామిలీ మెంబర్లుగా సత్యనారాయణ, నరేష్‌లు చేర్చుకున్నారు. తదనంతరం వారి ఆస్తికి సంబంధించిన పొలాన్ని, స్థలాన్ని వీరి పేర్లకు మార్చుకున్నారు. వీటిని దుగ్గిరాల, తెనాలి ప్రాంతానికి చెందిన వారికి విక్రయించారు. కాగా పూర్ణకుమారి ఇటీవల రైతుభరోసా డబ్బులు తన ఖాతాలో జమకావడంలేదని ప్రభుత్వ కార్యాలయాన్ని సంప్రదించింది. దీంతో అసలు విషయం బయటపడింది. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టగా వీరి భాగవతం బట్టబయలైంది. గుంటూరు, తెనాలి మరియు అమర్తలూరు సబ్‌రిజిస్టర్ ఆఫీసులలో హైదరాబాద్, దుగ్గిరాల, మరియు తెనాలికి చెందిన వ్యక్తులకు మొత్తం 5 రిజిస్ట్రేషన్ల ద్వారా అమ్ముకుని సుమారు రూ.55లక్షలు సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. సదరు ఆస్తి విలువ రూ.కోటిపైనే ఉంటాయని వివరించారు. తప్పుడు డెట్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికేట్ తయారు చేసినందుకు ఉపయోగించిన ల్యాప్టాప్ మరియు కలర్ ప్రింటర్‌ని మీసేవా నిర్వాహకుడు శివన్నారాయణకు చెందిన ఆఫీసు నుండి స్వాధీనం చేసుక్నుట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులు కోల్లపల్లి నరేష్, సత్యనారాయణ, తిరుపతిమరియదాసు, దాసరి శివన్నారాయణలను బుధవారం బుర్రిపాలెం రోడ్డులోని ఓ కళాశాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరి కొందరి ప్రమేయం ఉందని విచారణ అనంతరం అదుపులోకి తీసుకోనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న సీఐ ఉమేష్, ఎస్‌ఐ ఆనంద్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విచారణలో మరి కొన్ని...

సదరు నిందితులపై మంగళగిరి, అమర్తలూరు పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసు చొప్పున విచారణ జరుగుతోంది. 2020వ సంవత్సరంలో నరేష్ డాక్యుమెంట్ రైటర్‌తో కలిసి తన తల్లి కోలపల్లి రమాదేవి పేరు మీద ఉన్న ఓటు కార్డులో తన పేరుకు బదులుగా తన పిన్నిపేరు గుర్జేటి కళేశ్వరిగా మార్చి, ఫేక్ ఓట్ కార్డుతో నరేష్, డాక్యుమెంట్ రైటర్ కలిసి తన పిన్నికి చెందిన మూడున్నర ఎకరాల పొలాన్ని తెనాలి పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి అమ్మేశారు. దీనిపై అమర్తలూరు పోలీస్ స్టేషన్లో వీరిద్దరి పైన కేసు నమోదైంది. ఆ తరువాత నరేష్ తనకి తెలిసిన వారితో కలిసి గుంటూరు జిల్లా పొత్తూరులోని 30 సెంట్లు పొలముకు సంబంధించిన పత్రాలలో యజమాని పేరు మార్చి మంగళగిరి పట్టణానికి చెందిన రామినేని సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద ఆ పొలం దొంగ పత్రాలను తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నందుకు గానూ నరేష్ మీద మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ప్రస్తుతం ఇవి కూడా దర్యాప్తులో ఉన్నాయి.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలి

ఎంబీటీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లూరి శేఖర్

గుంటూరు(విద్య), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అద్భుతాల సృష్టికర్తలు ఇంజనీరింగ్ విద్యార్థులే అని, సాంకేతిక యుగంలో నెలకొన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాథమిక దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్ పెంపొందించుకోవాలని నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఏ.ఐ.సీ.టీ.ఈ ఇండక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాళ్లూరి శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధన దిశగా, ప్రారంభంలోనే తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని, నిత్యం సాంకేతిక రంగం వేగం పుంజుకుంటున్నదని, సమయాన్ని వృథా చేయకుండా విద్యపైనే శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ కే రవీంద్ర పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రామసుబ్బారావు (ఫైల్‌ఫొటో)

పిచికలపాలెం(శావల్యాపురం)ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పొలానికి నీళ్ళు పెట్టేందుకు వెళ్ళి రైతు మృతి చెందాడు. ఎస్సై లోకేశ్వరరావు కథనం ప్రకారం శావల్యాపురం మండలం పిచికలపాలేనికి చెందిన రైతు తిరువీధి రామసుబ్బారావు (64) పొలంలో నీటి అవసరాల కోసం విద్యుత్ మోటర్ బిగించుకొని కొంకేరువాగులో నీటితో పంటలు సాగు చేసుకొంటున్నాడు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కావడంతో ఇటీవల పొలంలో వరినారు పోశాడు. నారుమడికి నీళ్ళు పెట్టేందుకు తన కుమారుడు రంగారావుతో కలసి బుధవారం ఉదయాన్నే పొలానికి వెళ్ళాడు. రామసుబ్బారావు మోటర్ స్విచ్ వేసినా ఆన్ కాకపోవడంతో, విద్యుత్‌తీగలు కదిలిస్తుండగా షాకుకు గురై పడిపోయాడు. కుమారుని సమాచారంతో గ్రామస్తులు పొలం వద్దకు చేరుకొని రామసుబ్బారావును వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రామసుబ్బారావు మృతి చెందినట్లుగా డాక్టర్‌లు నిర్ధారించారు. విషయం తెలుసుకొన్న ఎస్‌ఐ లోకేశ్వరరావు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకొన్నారు. రామసుబ్బారావు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్ట్ మర్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ లోకేశ్వరరావు తెలిపారు. మృతునికి బార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు రామసుబ్బారావు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25,325 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 57 వేల 575 క్యూసెక్కుల వరదనీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 25 వేల 325 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టాకు 10వేల 342 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 8వేల 4 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 8,004 క్యూసెక్కులు

దుగ్గిరాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణాపశ్చిమ డెల్టాకు ప్రకాశం బ్యారేజి నుంచి బుధవారం గరిష్ఠంగా 8004 క్యూసెక్కుల నీరు విడు దల చేశారు. బ్యారేజి వద్ద 12.0 క్యూసెక్కులనీటి మట్టం ఉంది. బ్యారేజి నుంచి దిగువకు 25,375 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 300 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 1917, తూర్పు కాల్వకు 722, పశ్చిమ కాల్వకు 286, నిజాంపట్నంకాల్వకు 463, కొమ్మమూరు కాల్వకు 3160 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

ప్రమోషన్‌లలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు జడ్పీ ఉద్యోగుల ఫిర్యాదు

15 రోజుల్లో చర్యలు తీసుకోవాలని సీఈఓకు ఆదేశాలు

గుంటూరు సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో పదోన్నతుల వ్యవహారం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చేరింది. ఖాళీలు ఉన్నా భర్తీ చేయకుండా ఫైళ్లకు కొర్రీలు వేస్తూ ఎస్సీ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు తదితరులు ఈ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో 79 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు ఉండగా ఎస్సీలకు 15 శాతం కేటాయించాల్సి ఉందని.. ఆ లెక్కన 12 మంది ఏఓలు ఉండాల్సి ఉండగా, కేవలం 9 మంది మాత్రమే ఉన్నారన్నారు. మిగిలిన 3 ఖాళీలకు అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదుపై స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ జిల్లా పరిషత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు స మాచారం. ఈ అంశాన్ని జడ్పీ సీఈఓ 15 రోజుల్లో పరిష్క రించాలని, తదుపరి వివరాలు తెలియజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

8, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8, 10 తేదీల్లో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ స్పెషల్ ఈ నెల 8వ తేదీన రాత్రి 7.30కి బయలుదేరి 10.58కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.05కి గుంటూరు, 9వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి స్పెషల్ ఈ నెల 10వ తేదీ(ఆదివారం) రాత్రి 8.10కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.40కి గుంటూరు, 2.23కి సత్తెనపల్లి, 11వ తేదీ ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

ఫిరంగిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని వేములూరిపాడు గ్రామంలో గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. ఫిరంగిపురం పోలీసుల వివరాల ప్రకారం వేములూరిపాడు గ్రామానికి చెందిన పచ్చల అబ్రహం(76) సైకిల్‌పై పేరేచర్ల వైపు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో సైకిల్‌పై నుంచి వృద్ధుడు రోడ్డు పక్కన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి భార్య విజయమ్మ గత నెలలోనే మృతి చెందగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తర లించామని పోలీసులు తెలిపారు.

మంగళగిరిలో సీఎం పర్యటన సాగేదిలా...

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు గురువారం మంగళగిరిలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన మంగళగిరి ఆటోనగర్‌లోని హ్యాండ్‌లూమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్(వీవర్ శాల)కు చేరుకొంటారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అక్కడే చేనేత కార్మికులతో ముఖాముఖీగా సమావేశం అవుతారు. ప్రజావేదిక వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు తన పర్యటన ముగించుకొని ఉండవల్లిలోని నివాసానికి బయలుదేరతారు.

వేపకంపల్లి ఎంపీటీసీగా కనకదుర్గ శ్రీనివాసరావు


డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న కనకదుర్గ శ్రీనివాసరావు

కారంపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకపల్లి గ్రామ ఎంపీటీసీగా బొల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపీటీసీగా వ్యవహరించిన కోక అక్కమ్మ మరణించడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో వేపకంపల్లి గ్రామానికి చెందదంఇన బొల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు శుక్రవారం టీడీపీ తరుపున నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఎన్నికల అధికారి సిద్ధ లింగమూర్తి చేతుల మీదుగా వేపకంపల్లి ఎంపీటీసీగా కనకదుర్గ శ్రీనివాసరావు డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, చప్పిడి రాము, మునుగోటి సత్యం, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, ఉన్నం లక్ష్మీనారాయణ, బొల్నేడి కోటేశ్వరరావు, కందిమళ్ల లక్ష్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చిలకలూరిపేట, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): చిలకటూరిపేట గడియార స్తంభం సెంటర్లో ఒక యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పట్టణంలోని టీవీ రిపేర్ సెంటర్‌లో పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ అమీర్ (28) మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. అయితే బుధవారం షాప్‌లో టీవీ రిపేర్ చేస్తూ షాక్‌కు గురై మృతి చెందాడు.

ఇస్కాన్ గోశాల సేవకులపై దాడి

యడ్లపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవీడు గ్రామపరిధిలోని ఇస్కాన్ గోశాల సేవకులపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లాకు చెందిన పుష్పారాయ్ కొండవీడులోని ఇస్కాన్ గోశాలలో మూడేళ్లుగా ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నాడు. బుధవారం ఉదయం గోశాల కంచె దాటుకుని గేదెలు రాగా పుష్పారాయ్ వాటిని బయటకు తోలాడు. ఈ క్రమంలో గేదెల తాలూకు నలుగురు వ్యక్తులు గోశాల ఆవరణలోకి వచ్చి ఫెన్సింగ్‌ను ధ్వంసం చేయడంతోపాటు సేవకుడిపై దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మరో భక్తుడు బ్రజిత్ బర్మన్ కలుగచేసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేయగా అతనిపై దాడిచేశారు. దాడిలో ఇద్దరు సేవకులు గాయపడగా చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పుష్పారాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ టి శివరామకృష్ణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

49,084 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 50,597 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,084 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,027 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	10500	12800	నెంబరు. 5	10000	13300
341	10000	14000	273	----	----
4884	----	----	341	11000	14800
సూపర్ 10	10000	13400	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12200
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10200	12300
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	5000	7000

దళారుల దందా!

(5వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూములన్న వంకతో వారి భూములను కారు చౌకగా కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దళారుల దందాలో ఎంతోమంది సామాన్య రైతులు రూ.లక్షలకు లక్షలు నష్టపోతున్నారు.

● అసైన్డ్ రైతుల ప్లాట్లే టార్గెట్

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం భూసమీకరణ చేశారు. 29వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. వారిలో 29 గ్రామాలకు చెందిన 3,139 మంది అసైన్డ్ రైతులు.. 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వారి భూములపై సీఐడీ కేసులు వేసిన గత ప్రభుత్వం.. వారి స్థలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి ఐదేళ్లపాటు వేధించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ భూములకు సర్వహక్కులు కల్పించింది. రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం చట్టపరంగా రిజిస్టర్ చేసి అందిస్తోంది. అలా ఇచ్చే క్రమంలో రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావం అనే కాలమ్ వద్ద 'అసైన్డ్' అని నమోదు చేస్తోంది. ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు కూడా 'అసైన్డ్' స్వభావం ఉంటుందని చెప్పి, వాటికి ఎలాంటి హక్కులూ సంక్రమించవని, బ్యాంకుల నుంచి రుణాలు రావని చెబుతూ గజంపై రూ.10వేలు నుంచి రూ.20 వేల తగ్గిస్తున్నారు.

● సీఎం దృష్టికి వ్యవహారం

దళారుల దోపిడీని రాజధాని రైతులు ఇటీవల జరిగిన సమావేశంలో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికే తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం ప్రభుత్వం రిజిస్టర్ చేసి ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు అసైన్డ్ ఎలా అవుతాయి అంటూ సీఆర్డీఏ అధికారులను ప్రశ్నిం చారు. దానిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్ప టికీ దళారుల దందా తగ్గలేదు. ఇప్పటికీ అదే దోపిడీ కొనసాగుతోంది.

● సీఆర్డీఏ స్పందించకుంటే నష్టమే

రైతులకు ప్రభుత్వం ఇచ్చిన దస్తావేజుల్లో ఉన్న ఒక చిన్న సాంకేతిక అంశాన్ని ఆసరా చేసుకుని దళారులు దోపిడీ చేయడంపై ప్రభుత్వం, సీఆర్డీఏ తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. భూమి స్వభావం అనే కాలమ్‌లో 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేదంటే సీఆర్డీఏ అధికారులు, సంబంధిత మంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన, దళారులకు హెచ్చరిక చేయాలని కోరుతున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

● కమిషనర్ పులి శ్రీనివాసులు



అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో భవన నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మించే ఎటువంటి కట్టడాలనైనా పూర్తి స్థాయిలో కూల్చివేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 3 రోజుల నుంచి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను గుర్తించి తొలగిస్తున్నామన్నారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అనధికారిక, ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మించిన భవన యజమానులకు నోటీసులు జారీ చేశామని, సదరు నిర్మాణాలను కూల్చివేయడానికి పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డులోని భవానినగర్, శ్రీరామనగర్ 7వ లైన్, బొంగరాలబీడు, అరండల్‌పేట ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను కూల్చామన్నారు.

అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుర్తించి తుది నోటీసులు అందించిన 25 అనధికార భవనాలను గురువారం కూల్చివేత చేపట్టాలన్నారు. శుక్రవారం నుంచి అనధికార లే అవుట్స్ తొలగించాలన్నారు. అనధికార హోర్డింగ్స్‌ని ఉపేక్షించవద్దని, ఫీజులు చెల్లించని బోర్డులను తొలగించాలని, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ప్రతి రోజు వారి నిర్దేశిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి అనధికార నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, ఫీజులు చెల్లించని హోర్డింగ్‌లు తొలగించాలన్నారు. భవన నిర్మాణ సామగ్రి రోడ్ల మీద వేసిన వారిపై అపరాధ రుసుం విధించాలన్నారు.



పొగాకు కొనుగోళ్లు కొనసాగించాలని కోరుతూ వ్యవసాయ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘాల నేతలు

పొగాకు కొనుగోళ్లు కొనసాగించాలి

● ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ

గుంటూరు సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చివరి కాడ వరకు పొగాకు కొనుగోలు చేస్తా మని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి పొగాకు కొనుగోళ్లు నిలిపి వేసే ఆలోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లో ఉన్న వ్యవసాయ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం దగ్గర ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 20తో పొగాకు కొనుగోలు ఆపేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన విరమించుకోవాలని, చివరి కాడ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసింది 20శాతం మాత్రమేనని, మిగిలింది పూర్తిగా వెంటనే కొనుగోలు చేయా లని లేని పక్షంలో పొగాకు రైతులు ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరిక చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ రైతులకు చెప్పిన మాట ప్రకారం క్వింటాలుకు రూ.12 వేలు ధర వేయకుండా రూ.9వేలు, రూ.6 వేలు మాత్రమే వేయటమే కాకుండా ఎక్కువ శాతం పనికి రాదని తిప్పి పంపుతున్నారన్నారు. ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు కొనుగోలు చేసిన రైతులకి ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కంచుమాటి అజయ్, నల్లమడ సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి, నంద్యాల జిల్లా రైతు నాయకులు వెంకటేశ్వర గౌడ్, రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, ఏరువాక రైతు కూలీ సంఘం నాయకులు పాడిబండ్ల కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా రైతు నాయకులు బండి శంకరయ్య, రైతు, కౌలు రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

పీఎంవీబీఆర్‌వై పై అవగాహన అవసరం

● పీఎఫ్ అదనపు కమిషనర్ వీరభద్రస్వామి

గుంటూరు (విద్య), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి వీక్షిత్ భారత్ రోజ్ గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పై ఉద్యోగులకు అవగాహన అవసరమని పీఎఫ్ అదనపు కమిషనర్ వీరభద్ర స్వామి సూచించారు లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ హాల్లో బుధవారం నిర్వహించిన అవగా హన సదస్సులో ఆయన మాట్లాడారు. కంపెనీల్లో కొత్తగా చేరే ఉద్యో గుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ పథకం ఉపయోగపడుతుం దని తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్ ప్రభు దత్త, ఛాంబర్ ఆఫ్ కామర్స్ పూర్వ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్ర స్వామి

సిస్టర్లపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలి

● నగరంలో క్రైస్తవ, దళిత, ప్రజా సంఘాల శాంతి ర్యాలీ

గుంటూరు(తూర్పు), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దుర్గ్ రైల్వేస్టేషన్‌లో మతమార్పిడి చేస్తున్నారనే నేపంతో అరెస్టు చేసిన సిస్టర్ వందన ఫ్రాన్సిస్, సిస్టర్ ప్రీతి మేరీలను తక్షణమే విడుదల చేసి, వారిపై కేసులను తొలగించాలని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ క్రైస్తవ సంఘాల ఐక్యత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న సెయింట్ ఆగ్నేస్ వారి దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన శాంతియుత ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసం గించారు. భారత దేశంలో ఎవరూ మాతమార్పిడి చేయరని స్పష్టం చేశారు. దేశంలో క్రైస్తవులు ఒంటరి వారు కాదని, వారి వెంట ప్రజలతో పాటు సజీవుడైన ఏసుక్రీస్తు ఉన్నాడని అన్నారు. క్రైస్తవ మిషనరీలపై దాడులు, అరెస్టులు సరికాదని అన్నారు. విముక్తి చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్ మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులు పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల రక్షణకు పటిష్ట చట్టాలు అవసరమని అభిప్రాయపడ్డారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో ఖాజావలీకి వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీ లో పాస్టరు గాబ్రియేల్, సహదేవ్, నెహెమ్యా, మార్కు, ఎల్‌జే బాబు రావు, సతీష్‌కుమార్, ఫాదర్లు కిరణ్, రాజు, రాయప్ప, అబ్రహం, విశ్రాంత పోలీసు అధికారి విజయపాల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



శాంతిర్యాలీలో పాల్గొన్న చిన్నాబత్తిని భాగ్యయ్య, పాస్టర్లు, ఫాదర్లు, వివిధ సంఘాల నాయకులు

ఉత్తమ కవిగా రాయపురెడ్డి ఎంపిక

గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫేస్ బుక్ 'అమరావతి సాహి తీ మిత్రులు' గ్రూపులో వారం వారం నిర్వహిస్తున్న కవితల వర్క్ షాపులో ఏ వారానికి ఆ వారం ఉత్తమ కవితలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు ఒక ప్రకట నలో తెలిపారు. నెల మొత్తం మీద నాలుగు వారాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఒక కవిని ఎంపిక చేసి 'ఉత్తమ కవి ప్రతిభా సత్కారం' అందిస్తారన్నారు. 2025 జూలై నెలలో ఉత్తమ కవి ప్రతిభా సత్కారానికి రాయపురెడ్డి సత్యనారాయణ (హైదరాబాద్) ఎంపికైనట్లు పేర్కొన్నా రు. ఈ నెలలో మూడో ఆదివారం ఉదయం నగరంలోని బ్రాడీపేట లో ఉన్న సర్వీసు హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో జరిగే 'అమ రావతి సాహితీ మిత్రులు' సమావేశంలో ఆయనను సత్కరిస్తామని రంగారావు తెలిపారు.



రాయపురెడ్డి సత్యనారాయణ

ఏపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో జిల్లా నేతలకు స్థానం

గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్యం ఠాగూర్ ఛైర్మన్‌గా ఏపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతలకు స్థానం దక్కింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, పల్నాడుకు చెందిన సూర్యానాయక్‌లకు స్థానం కల్పించారు. లింగంశెట్టి ఇప్పటికే ఏపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.



డీఈవో రేణుకకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

విద్యాశక్తి పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

గుంటూరు(విద్య), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయ డం తగదని ఫ్యాప్టో నాయకుల విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీఈవో రేణుకకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి అనే కార్యక్రమం ఐచ్ఛికంగా నిర్వహించాలని పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ తెలియచేశారు. కానీ మన జిల్లాలో కొన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధంగా మారుస్తున్నారని ఫ్యాప్టో అధ్యక్షుడు కె.నరసింహారావు తెలియజేశారు. విద్యాశక్తి కార్యక్రమాల గురించి ఎవరినీ నిర్బంధం చేయొద్దని ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీఈవో రేణుక మాట్లాడుతూ విద్యాశక్తి కార్యక్రమం విద్యార్థులకు కానీ, ఉపాధ్యాయులకు ఐచ్ఛికం మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ కె.నరసింహారావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యూ.రాజశేఖర్, డీకే సుబ్బారెడ్డి, ఎండీ ఖలీద్, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమలేష్, కళాధర్, పెదబాబు, బాలాజీ, వై శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో మెరుగైన ఉపాధి అవకాశాలు

గుంటూరు (విద్య), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో కృత్రిమ మేధ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు రానున్నాయని జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరనాయుడు అన్నారు. బుధవారం బుడంపాడులోని కళాశాలలో హ్యాకథాన్ నిర్వహించారు. సందర్భం గా ఆయన మాట్లాడుతూ వెబ్ డెవలప్మెంట్, ఏఐ టూల్స్ గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. హ్యాకథాన్ ఉద్దేశాన్ని డీన్ బి.వరప్రసాద్, టెక్ ఫైల్ ప్రతినిధి వైరవివర్మ తదితరులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఎస్.సింధూర, డైరెక్టర్ షేక్ కరీ ముస్సీసా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ నాయుడు తదితరులు

రేపు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన స్థానిక పేరేచర్ల మైదానం లో సీనియర్ బాలుర విభాగంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపి కలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మరి క్రాంతికుమార్, దుర్గామోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో అర్హత సాధించిన క్రీడాకారులు 9న బాపట్లలో జరిగే నల్ల మడ జోన్ లీగ్ మ్యాచ్‌లో పాల్గొంటారని అన్నారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు వైజాగ్‌లో ఆగస్టు 16, 17వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 96429 31771 అనే నెంబరులో సంప్రదించాలని సూచించారు.

దశావతార వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వెంకన్నస్వామి దివ్య క్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా బుధవారం పెద్ద ఎత్తున భక్తులు ఆలయం దర్శించారు. స్వామి వారి దేవస్థానంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ పట్టి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.



దశావతార వెంకన్న స్వామిని దర్శించిన భక్తులు

ఘనంగా భూవరాహ స్వామి జయంతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సీతానగరం విజయ కీలాద్రిలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి మంగళ శాసనాలతో భూవరాహస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు భూవరాహ హోమం, అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనంతో మొదటి రోజు కార్యక్రమం వైభవంగా జరిగింది.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

పెదనందిపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(హెచ్‌ఈ)లో విద్యార్థుల సౌకర్యార్థం దాతలు కంప్యూటర్‌ను బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన శాఖమూరి శివన్నారాయణ జ్ఞాపకార్థం వారి భార్య సీతారత్నమ్మ కుమారుడు సత్యకృష్ణ, శిరీషా ఎన్నారైలు బహూకరించిన కంప్యూటర్‌ను టీడీపీ సీనియర్ నాయకులు బత్తిని వేణు హెచ్‌ఎంకు అందజేశారు. సీతారత్నం, హెచ్‌ఎం రూజ్‌వెల్ట్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గద్దర్ ప్రజా యుద్ధనౌక

గుంటూరు(తూర్పు), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గద్దర్ సాయుధ పోరాటం నుంచి సామాజిక సాంస్కృతిక పోరాటాల వరకు ప్రజా యుద్ధ నౌకగా నిలిచారని దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. బుధవారం, స్థానిక లాడ్జి సెంటర్, అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ రెండో వర్ధంతి, చుండూరు దళిత మృతవీరుల సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజా పోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గద్దర్ పేద ప్రజల కోసం సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొనడమే గాక సాంస్కృతిక కళారూపాలను దేశ వ్యాప్తంగా ప్రదర్శించాడని గుర్తుచేసుకున్నారు. ప్రజా గాయకుడు పీవీ రమణ మాట్లాడుతూ చుండూరు ఘటన జరిగి ముప్పై ఏళ్లు గడిచినా ఆ కుటుంబాలకు న్యాయం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు అవసరమని అన్నారు. ఈ సభలో మద్దు ప్రేమ్‌జ్యోతిబాబు, నల్లపు నీలంబరం, భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు, లెనిన్ గద్దర్, సాంబ శిరావు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొన్న దళిత, బహుజన, ప్రజాసంఘాలు

అనారోగ్యంతో పదో తరగతి విద్యార్థి మృతి

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం పెదపలకలూరు వద్ద గల ఓ కార్పొరేట్ స్కూల్లో పదోతరగతి చదువుతున్న ఏలూరి నారాయణ (15) అనే విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. విషజ్వరమే కారణంగా తెలుస్తోంది. స్తంభాలగరువు సెంటర్ నందు గల ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ నారాయణ మృతి చెందాడు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గోనెపల్లె గ్రామానికి చెందిన ఏలూరి నారాయణ కార్పొరేట్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. అనారోగ్య కారణాల వల్ల తన తల్లిదండ్రులను చూడటానికి అయిదు రోజుల క్రితం తన స్వగ్రామానికి వెళ్లాడని సమాచారం. ఇంట్లో ఉన్న మూడవ రోజున, అతనికి జ్వరం వచ్చి నాలుగు రోజులు చికిత్స పొందాడు. అతను పాఠశాలకు తిరిగి వచ్చి తరగతులకు హాజరయ్యాడు. కానీ మరుసటి రోజు అతను తీవ్ర జ్వరంతో మళ్ళీ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. స్కూల్ యాజమాన్యం అతని మామకు సమాచారం అందించారు. దీంతో ఆయన పాఠశాలకు వచ్చి విద్యార్థిని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. డాక్టర్ పరీక్షించి విద్యార్థికి గుండె కొట్టుకోవడం సక్రమంగా లేకపోవడం, మూత్రపిండాలు పనిచేయక పోవడం వంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. వైద్య ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆ విద్యార్థి బుధవారం ఉదయం మరణించాడు.



ఏలూరి నారాయణ

సీఎం చంద్రబాబుకు ఎంపీపీ జబీన్ కృతజ్ఞతలు

దుగ్గిరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రను సఫలం చేసుకున్న 71మందికి ఒక్కొకరికీ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం మంజూరు చేసి నందుకుగానూ సీఎం చంద్రబాబు నాయుడుకు హజ్ కమిటీ రాష్ట్ర సభ్యురాలు, ఎంపీపీ జబీన్ కృతజ్ఞతలు తెలిపారు. హజ్‌కమిటీ సభ్యులను వెంటబెట్టుకుని, ముఖ్యమంత్రిని సెక్రటేరియట్‌లో కలిసి మొక్కను అందించి ధన్యవాదాలు తెలిపినట్టు ఆమె బుధవారం ఓ ప్రకటనలో చెప్పారు.



సీఎం చంద్రబాబుకు మొక్కను అందజేస్తున్న హజ్‌కమిటీ రాష్ట్ర సభ్యురాలు, ఎంపీపీ షేక్ జబీన్

ప్రభుత్వానికి సహకరించాలి

● సినీ నటుడు సుమన్

తుళ్లూరు, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి) : అమరావతిలో రోడ్లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సినీ నటుడు సుమన్ అన్నారు. బుధవారం మందడంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. 11 భాషల్లో 800 సినిమాల్లో నటించిన తనకు అందరూ మద్దతుగా ఉండడం వల్లనే, ఈ స్థాయికి వచ్చానని అన్నారు. అమరావతిలో వన్‌బై వన్ అభివృద్ధి జరిగి సకల సౌకర్యాలతో ఉండబోతుందనే అభిప్రాయాన్ని సుమన్ వెల్లడించారు.

స్కేటర్ జెస్సీరాజ్‌కు మంత్రి అభినందన

మంగళగిరి సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతరాతీయ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్‌ను ఏపీ రవాణా, యువ జన, క్రీడా శాఖల మంత్రి మండి పల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అభినందించారు. బుధవారం ఏపీ క్రీడల మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని మర్యా దపూర్వకంగా కలిశారు. జెస్సీరాజ్‌ను ఘనంగా సత్కరించిన మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆమె భవిష్యత్తు లో మరిన్ని పతకాలను సాధించి ఏపీకి మంత్రి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.



జెస్సీరాజ్‌ను అభినందిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

9న టూల్ డౌన్ నిరసన

మంగళగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న మున్సిపల్ కార్యాలయాల వద్ద టూల్ డౌన్ నిరసన తెలియజేస్తున్నట్టు కార్మిక సంఘాల నేతలు తెలి పారు. మంగళగిరి సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గా రావు మాట్లాడుతూ జీవో నెం.36పై స్పష్టత ఇవ్వాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



మాయాబజార్లో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

మూడేళ్లలో మాయాబజార్ రూపురేఖలు మారుస్తా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణ పనుల పరిశీలన

గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రానున్న మూడేళ్లలో మాయాబజార్ రూపురేఖలు మార్చే విధంగా కృషి చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. మాయాబజార్లో రూ.50 లక్షల విలువతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ల పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50 ఏళ్లుగా మాయాబజార్ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి ఉన్నతంగా ఎదిగిన వారేనని అన్నారు. కార్పొరేటర్, నాయకుల సహకారంతో మాయాబజార్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. వ్యాపార కేంద్రంగా ఉన్న మాయాబజార్ ప్రాంతంలో గతంలో కనీస వసతులు కూడా లేని దయనీయ స్థితి నెలకొందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని ప్రాంతాలతోపాటు మాయాబజార్ అభివృద్ధికి ముందడుగు వేశామని తెలిపారు. ఈ క్రమంలో సుమారు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతంలో అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, సత్యనారాయణ, ఖుద్దూస్, జాదా, పెండ్యాల విజయ్‌కుమార్, ఫారుక్, ఉస్మాన్, వసంతం శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఎం శ్రీను, జండా సుభాని, ఫైమా, కృష్ణా బాజీ, ఫేదాయిత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే మాధవి జన్మదిన వేడుకలు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి నేతలు, కార్పొరేటర్లు, అభిమానులు ఘనంగా నిర్వహించి, పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కూటమి నేతలు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మైనార్టీ సెల్ నేతలు హజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గాలో ముస్లింలు ఎమ్మెల్యే కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గాలం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి వందలాది మందికి అన్నదానం చేశారు. 28వ డివిజన్లో యాదవ్‌ల ఆధ్వర్యంలో అన్నదానం, కేక్ కటింగ్ నిర్వహించారు. 22వ డివిజన్లో వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కటింగ్ చేశారు. గుజ్జనగుండ్లలో స్థానిక నేతలు పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్లు, గ్లాసులు, మాస్కులు పంపిణీ చేశారు. ఫాతిమాపురం మున్సిపల్ స్కూల్లో కేక్ కటింగ్ నిర్వహించి, విద్యార్థులకు భోజనం పెట్టారు. 36వ డివిజన్ అధ్యక్షుడు తెలంగాణ శ్రీను ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గళ్ళా మాధవి జన్మదినాన్ని సేవా రూపంలో జరుపుకోవడం ఆమె ప్రజాసేవపై అంకిత భావాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. మాధవి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజల మౌలిక అవసరాలకు శాశ్వత పరిష్కారాలు అందిస్తున్నారని నాయకులు కొనియాడారు.



పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సుఖవాసి, కూటమి నేతలు

సైబర్ ముఠా వెనుక మనీ లాండరింగ్

● సూట్ కేస్ కంపెనీల ద్వారా విదేశాలకు బ్లాక్ మనీ

● ధీరమ్స్ ... డాలర్స్ ద్వారా వైట్‌గా మార్చి తిరిగి ఇండియాకు

● పోలీస్ కస్టడీలో నోరు విప్పిన నిందితులు

● కీలక సమాచారం రాబట్టిన పోలీసులు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరానికి పాల్పడి అమాయకుల నుంచి కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ల వెనుక మనీ లాండింగ్ కోణం కూడా ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. ఇటీవల అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన సైబర్ క్రైమ్ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన విషయం విదితమే. గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న నిందితులు సూర్యప్రకాశ్ రెడ్డి, విష్ణువర్ధన్, సుధాకర్, నిజామాబాద్‌కు చెందిన రంజిత్, నేపాల్‌కు చెందిన విశాల్ తదితరులను అరండల్‌పేట పోలీసులు రెండు రోజుల క్రితం పోలీస్ కస్టడికి తీసుకున్నారు. కస్టడీలో పోలీసు విచారణలో నిందితులు కీలక వివరాలు వెల్లడించినట్లు తెలిసింది. ఇప్పటికే పోలీసులు హైదరాబాదులోని మియాపూర్‌లో సూర్యప్రకాష్‌రెడ్డికి ఉన్న కార్యాలయాన్ని సీజ్ చేశారు. ఆ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లతో పాటు పలు డాక్యుమెంట్లను సీజ్ చేసినట్లు తెలిసింది. సూర్య ప్రకాష్ రెడ్డి ఇప్పటికే గుంటూరుతో పాటు అనేక ప్రాంతాల్లో అమాయకుల పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరిచి వాటి ద్వారా కోట్లాది రూపాయల లావాదేవీలు సాగించారు. ఆ సైబర్ గుట్టు రట్టు చేసేందుకు పోలీసులు మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నారు అయితే పోలీస్ స్టేషన్లో సైబర్ నేరానికి సంబంధించిన సమాచారంతోపాటు ఈ ముఠా వెనుక మనీ ల్యాండరింగ్ వ్యవహారాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఇండియా నుంచి రూపాయలను దుబాయ్‌కి పంపి అక్కడ ధీరమ్స్‌గా మార్చి ఆ తర్వాత ధీరమ్స్‌ను డాలర్స్‌లోకి తిరిగి డాలర్‌ను రూపాయిల్లోకి మార్చి కోట్లాది రూపాయల బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ముఠాకు అంత పెద్దంలో కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఒకవైపు సైబర్ నేరాలతో పాటు మరో మనీ లాండరింగ్ వ్యవహారం ఉన్నట్లు తేలడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా నిందితులకు ఇచ్చిన పోలీస్ కస్టడీ గురువారంతో ముగియనుంది. నేపథ్యంలో మరోసారి కస్టడీకి తీసుకోవాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ముఠా వెనుక ప్రముఖుల పాత్ర ఉంటుందనే అనుమానాలు కలుగుతున్నాయి.



డ్వాక్రా మహిళలు

ఇక వివరాలన్నీ పక్కా

● స్వయం సహాయక సంఘాలకు లోకోస్ యాప్

సత్తెనపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాలకు చెందిన సమగ్ర లావాదేవీలు, సమావేశాలు తదితర వివరాలన్నీ ఒకే చోట కేంద్రీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లోకోస్ యాప్ త్వరలో అందుబాటులోకి రానుంది. అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు మహిళలకు పూర్తి స్థాయిలో సమాచారం అందించేందుకు 2023లో దీనిని పోర్టల్ రూపంలో తీసుకు వచ్చింది. ఐతే అప్పట్లో నిర్వహణకు గత ప్రభుత్వం వెనుకడుగు వేసింది. దీంతో క్షేత్ర స్థాయికి చేరలేదు. కూటమి ప్రభుత్వం రాకతో ఈ యాప్‌ను పునర్వ్యవస్థీకరిస్తున్నారు. ఇప్పటికే మండల, గ్రామ స్థాయిలో వీవోల నుంచి అధికారుల వరకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారు.

ఎక్కడి నుంచైనా

సిబ్బందికి శిక్షణ పూర్తయ్యాక వివరాలన్నీ యాప్‌లో కన్పించనున్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ప్లే స్టోర్ ద్వారా ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ప్రత్యేక లాగిన్ ఐడీల ద్వారా ఎక్కడి నుంచైనా వివరాలు చూసుకోవచ్చు. సంఘాలతో పాటు జీవనోపాధుల ఫోటోలు, ఇతర వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. దీంతో ఆర్థిక స్థితి గతులు తెలుస్తాయి.

ఉపయోగాలు ఇవి....

పొదుపు సంఘాల బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, శ్రీనిధి, పెట్టుబడి సాయం, పొదుపు నిల్వ, అంతర్గత అప్పులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమావేశాలు, తీర్మానాలు, రుణాలు, వసూళ్ళు, బ్యాంకులకు చెల్లింపులు తదితర వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ లాంటి పథకాల గురించి కూడా తెలుసుకోవచ్చు. పారదర్శక సేవల్లో భాగంగా ఇటీవల రాష్ట్రంలో తీసుకు వచ్చిన మన డబ్బులు, మన లెక్కలు యాప్‌కు ఇది అనుసంధానంగా పని చేస్తుంది.

దేశ మంతటా ఒకేలా...

పొదుపు సంఘాలకు మంజూరవుతున్న రుణాల్లో కేంద్రం వాటా 60 శాతం, జాతీయ గ్రామీణ లొవ్‌లీ ఉడ్ మిషన్ పథకం కింద నిధులు ఇస్తుంది. రాష్ట్రంలో దీనికి అనుబంధంగా ఎస్ఎస్ఆర్ఎల్ అమలవుతుంది. సెర్ప్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఇతర రాష్ట్రాల్లోనే వివిధ విభాగాలు చూస్తున్నాయి. ఈ క్రమంలో దేశం మొత్తం వివరాలు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా లోకోస్ యాప్‌ను ప్రభుత్వం తీసుకు వచ్చింది.

కష్టనష్టాల కలనేత.. చేనేత!

● ఆసరా కోసం ఆశగా చూస్తున్న నేతన్నలు
● పవర్ లూమ్ ధాటికి కొన ఊపిరిలో చేతిమగ్గం



గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రెక్కల కష్టం మీద బతికే నేతన్నలు ఎప్పుడూ ఉచితాలను కోరుకోలేదు. వారు కోరుకునేదల్లా చేతినిండా పని, పనికి తగిన మజూరీ మాత్రమే! కానీ ఆ దిశగా ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న దాఖలాలు లేవు. పైపెచ్చు ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు స్వయం ప్రకాశిత చేనేతను చిదిమేశాయనే చెప్పాలి. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల తాలూకు దుష్ఫలితాలు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మూడు జిల్లాల్లో ఉన్న 50 వేల కుంటుంబాలు ప్రమాదపుటంచుల వరకూ వెళ్లిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా ఈ రంగం నిరాదరణకు గురి కావడంతో కొన్ని వేల కుటుంబాలు వృత్తికి దూరమయ్యాయి. గత ప్రభుత్వం ఇచ్చినట్లు పప్పు బెల్లాల పంపకం కాకుండా, తమకు జీవితాంతం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం నిర్దిష్ట కార్యక్రమం తీసుకోవాలని కోరుకుంటున్నారు.

● చేనేత మార్కెట్‌ను ఆక్రమించిన పవర్‌లూమ్..

గడిచిన రెండు దశాబ్దాల్లో చేనేత కోలుకోలేనంతగా దెబ్బతింది. అందుకు కారణం పవర్‌లూమ్ పరిశ్రమ. చేనేత మగ్గాలపై నేత కళాకారులు రూపొందించిన వస్త్రాలను ఆ మరుసటి రోజు నుంచే పవర్ మగ్గాలపై ఉత్పత్తి చేస్తున్నారు. వాటిని చేనేత వస్త్రాలుగా బహిరంగ మార్కెట్లో తక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. దీంతో చేనేత మార్కెట్‌ను పవర్‌లూమ్ మార్కెట్ ఆక్రమించింది. గతంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉత్పత్తి చేసే పవర్‌లూమ్ వస్త్రాలను.. ఇప్పుడు నేరుగా బాపట్ల జిల్లా చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, గుంటూరు జిల్లా మంగళగిరి, పల్నాడు జిల్లా చిలకలూరిపేట సహా అనేక ప్రాంతాల్లో పవర్ మగ్గాలు పెట్టి, అక్కడే భారీగా ఉత్పత్తి చేసి.. చేనేత వస్త్రాలుగా మార్కెట్లోకి వదిలేస్తున్నారు. దురదృష్టమేంటంటే అవే పవర్ లూమ్ వస్త్రాలను చేనేత వస్త్రాలుగా రాష్ట్ర ప్రభుత్వ సహకార సంస్థ ఆప్కో కూడా విక్రయిస్తోంది. దీనిపై చేనేత కార్మికులు అధికారులకు, ప్రభుత్వాలకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. చేనేత వస్త్రాలు సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల దగ్గర నిలిచిపోయాయి. ఈ కారణంగా మూడింట ఒక కుటుంబం నేతను వదిలి వేరే పనులకు వెళుతున్నారని తెలుస్తోంది.

● తాయిలాలతో సరిపుచ్చిన గత ప్రభుత్వం

చేనేత రంగం చితికిపోతున్న దశలో ఉన్నాగానీ గత ప్రభుత్వం పట్టనట్లు వదిలేసింది. కేవలం నేతన్న నేస్తం పేరుతో నూటికి పది మందికి తాయిలాలు పంచుతూ అదే నేతన్నల సమస్యలన్నింటికీ పరిష్కారమన్న చందంగా వ్యవహరించింది. ఫలితంగా చేనేత రంగమే అంతరించిపోయే పరిస్థితి దాపురించింది. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో చేనేత వాటా దారుణంగా పడిపోయింది. కిందటేడాది కేంద్ర బడ్జెట్లో చేనేతకు రూ. 200 కోట్లు కేటాయించారు. కానీ దానిని సవరణ బడ్జెట్లో రూ.190 కోట్లకు తగ్గించారు. తాజాగా 2024- 25 బడ్జెట్లో కూడా అవే రూ.200 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. మొత్తంగా జౌళీ శాఖకు కేంద్రం రూ.4,392.85 కోట్లు కేటాయించగా అందులో చేనేతకు 4.5 శాతం మాత్రమే నిర్దేశించారు. చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం, నూలు సబ్సిడీ, చేనేత క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకం, సేవా కేంద్రం, మ్యూజియం తదితర పథకాలకు మాత్రమే ఆ నిధులు సరిపోతాయి. కాగా గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా చేనేతకు బడ్జెట్ కేటాయించలేదు. కేవలం రూ. 200 కోట్లు కేటాయించి వాటిని ఉద్యోగుల జీతభత్యాలు, నేతన్న నేస్తానికి ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో వచ్చే రాష్ట్ర బడ్జెట్‌పై నేతన్నలు భారీగా ఆశలు పెట్టుకున్నారు.

● ప్రభుత్వం పూనుకుంటే మహర్దశే!

స్వయంపోషక చేనేత పరిశ్రమకు ఏ ప్రభుత్వమైనా



పెద్దగా చేయాల్సింది ఏమీ లేదు. చేనేత కార్మికులు కోరుకునేది తీర్చలేని కోరిక కాదు. వారు కోరుకునేదల్లా చేనేత మార్కెట్‌ను సంరక్షించడం. అద్భుతమైన హస్త కళా శిల్పాలను పవర్‌లూమ్ మగ్గాలపై ఉత్పత్తి చేయకుండా చూస్తే చాలు. నూతన జౌళీ విధానంలో భాగంగా చేనేతకు కేటాయించిన చీరెలు, దోవతులు, పంచెలు, తువ్వాళ్లు వంటి 11 రకాలను చేనేత మీదే ఉత్పత్తి అయ్యేలా చట్టాన్ని అమలు చేయాలి. పురాతన కుటీర పరిశ్రమ కాబట్టి వాణిజ్య దృష్టితో చూడకుండా చేనేతకు కావాల్సిన ముడి సరుకులపై పన్నులు, సుంకాలు, జీఎస్టీలు తొలగించాలి. తాజాగా కూటమి ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించింది కానీ, ముడి సరుకులపై జీఎస్టీ కొనసాగుతోంది. ఫలితంగా ఉత్పాదక వ్యయం పెరిగి చేనేత బట్ట రేటు ఎక్కువవుతోంది. చేనేతకు కావాల్సిన చిలప నూలును ప్రతి నూలు మిల్లు 50 శాతం తయారయ్యేలా చూడాలని నేతన్నలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. పవర్లూమ్ వస్త్రాల కారణంగా దెబ్బతిన్న చేనేత మార్కెట్ ప్రతిష్టను పునరుద్ధరించాలి. చేనేతకు ట్రేడ్ మార్కు కేటాయించాలి.

● మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి

వ్యవసాయరంగంలో మద్దతు ధర ప్రకటించి రైతులను కాపాడినట్లే చేనేత కార్మికులను కాపాడేందుకు ప్రభుత్వం మద్దతు ధర విధానాన్ని అమలు చేయాలని నేతన్నలు బలంగా కోరుతున్నారు. చేనేత వస్త్రాల ఉత్పాదక వ్యయం, కార్మికుల శ్రమ విలువను లెక్కగట్టి వస్త్రాలకు ధరలను నిర్ణయించి, ఆ ధరల ప్రకారమే మార్కెట్‌ను నిర్వహించాలి. చేనేత కార్మికులకు కనీస వేతన చట్టం అమలయ్యేలా చూడాలి. గత కొన్నేళ్లుగా సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల వద్ద నిలిచిపోయిన ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయించాలి. రైతులకు అన్నదాత సుఖీభవ అందజేస్తూ భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం స్వయం ఉపాధి రంగమైన చేనేతకు కూడా అలాంటి భరోసా కల్పించాలి.

● ఘోరంగా దెబ్బతిన్న చేనేత మార్కెట్

చేనేత వస్త్రం అనేది ఒక బ్రాండ్ ఇమేజ్ ఉన్న ఉత్పత్తి. గత వైసీపీ హయాంలో చేనేత పేరుతో మార్కెట్లోకి వచ్చిన పవర్‌లూమ్ ఉత్పత్తులను కొన్న వినియోగదారులు ఘోరంగా మోసపోయారు. మోసపోయిన వినియోగదారులు చేనేత ఏదో.. నకిలీ ఏదో గుర్తించలేక చేనేత వస్త్రాలను కొనడమే మానేసే పరిస్థితికి వచ్చారు. ఫలితంగా హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, ముంబై, ఢిల్లీలలో ఉన్న అతిపెద్ద చేనేత మార్కెట్లన్నీ తమకు చేనేత వస్త్రాలు వద్దని బోర్డులు పెట్టాయి. ఫలితంగా రెండేళ్లుగా చేనేత ఉత్పత్తులన్ని ఉత్పత్తిదారుల దగ్గరే ఆగిపోయి, గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో మాస్టర్ వీవర్లు ఉత్పత్తిని నిలిపివేశారు. కార్మికులకు పని కల్పించడం ఆపేశారు. మరో వైపు 2020లో వచ్చిన కరోనా చేనేతను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్మికులకు ఉపాధి లేకుండా చేసింది. కరోనా వంకతో ఉత్పత్తిదారులు కార్మికులకు పని కల్పించలేదు. కరోనా అనంతర కాలంలో చేనేత సంరక్షణకు చేపట్టాల్సిన కనీస చర్యలు కూడా అప్పటి వైసీపీ ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో యజమానులు కార్మికుల శ్రమను ఘోరంగా దోచుకున్నారు. గతంలో ఇచ్చే మజూరీల కంటే సగానికి సగం కూలీలు(మజూరీలు) తగ్గించి ఇచ్చారు. తాజా గణాంకాల ప్రకారం చేనేత మగ్గాల సంఖ్య సగానికిపైగా తగ్గినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిపై తక్షణం ప్రభుత్వం దృష్టిపెట్టాల్సి ఉంది.

● కూటమి సర్కారుపైనే నేతన్నల ఆశలు

తాజాగా చేనేత దినోత్సవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళగిరిలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు జిల్లాల నేతన్నల్లో ఎన్నో ఆశలు కనిపిస్తున్నాయి. పోయిన ఐదేళ్లలో యువనేత నారా లోకేశ్ చేనేతను సంరక్షించేందుకు మంగళగిరిలో కొంత ప్రయత్నం చేశారు. అధికారం, పదవి లేకపోయినా సొంత నిధులతో నేతన్నలకు అధునాతన యంత్ర సామగ్రిని అందించడంతోపాటు, మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మంగళగిరిని నమూనాగా తీసుకుని ప్రముఖ చేనేత కారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే ప్రయత్నం చేశారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్షిప్ తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైన, ప్రత్యేకించి యువనేత లోకేశ్‌పైన నేతన్నలు ఆశలు పెంచుకున్నారు. అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ పరంగా సమగ్ర కార్యక్రమాన్ని అమలు చేసి చేనేత సంరక్షణ చేపట్టాలని నేతన్నలు వేడుకుంటున్నారు.

తెనాలి-చందోలు రహదారి అధ్వానం



చందోలు మార్గంలో సగం రహదారి కుంగిపోయిన దృశ్యం



పెదపూడి వంతెన వద్ద కుంగిపోయిన రోడ్డు



మండూరు వంతెన వద్ద కోతకు గురై వంకర్లు తిరిగిన రహదారి

తెనాలి అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అధ్వానమైన రోడ్లతో నానా ఇక్కట్లు పడ్డాం, ప్రభుత్వం మారిన వెంటనే రోడ్లు బాగుపడతాయనే ఆనందం అట్టే నిలబడలేదని ప్రయాణికులు వాపోతున్నారు. తెనాలి-చందోలు మార్గంలో కృష్ణా పశ్చిమ డివిజన్, తూర్పు, పడమర నిజాంపట్నం కాల్వల మధ్య ఉన్న రహదారి పలుచోట్ల కోతకు గురికావడం, కుంగిపోవడం, గుంతలతో అధ్వానంగా, ప్రయాణాన్ని నరకం చేస్తోంది. పెదరావూరు-కూచిపూడి మధ్య గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడిన సమయంలో ఈ గుంతల్లో నీరు నిలిచి ఎక్కడ ఏముందో తెలియకుండా పోతోంది. ద్విచక్ర వాహనాలే ప్రయాణం చేయలేకపోతుంటే పెద్ద వాహనాల్లో వెళుతున్న వారి పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది. మండూరు వంతెన-పెదపూడి వంతెనల మధ్య రహదారి అంచులు విరిగిపోయి అష్ట వంకర్లు కనిపిస్తున్నాయి. వాహన చోదకులు ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో ఎదురెదురు వెళుతున్నవారు బాగున్న మార్గంలోనే వెళ్లే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెదపూడి వంతెన వద్ద కాల్వ వెంబడి నిర్మించిన రిటైనింగ్ వాల్ ఒరిగిపోవడంతో ఓ వంద మీటర్ల మేర కుంగిపోయిన రహదారిని చక్కదిద్దడానికి పలుమార్లు ఆర్ అండ్ బీ శాఖ కేటాయించిన నిధులు ఉపయోగం లేకుండా పోయాయి. ఇక్కడ రహదారిని చక్కదిద్దే లోపే మరికొంత దూరంలో మరో వంద మీటర్ల మేర రహదారి సగం కుంగిపోయి ప్రమాద భరితంగా మారింది. రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదం కొనితెచ్చుకున్న వారవుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఈ మార్గంలో రోడ్లు దెబ్బతిన్న చోట కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఆరు నెలల్లో రోడ్లు వేస్తామనే బ్యానర్లు కట్టారని, ఏడాదిన్నర అయినా అతీ గతీ లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఘనంగా ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డీజీఎం కృష్ణప్రభు, జయకుమార్ తదితరులు

గుంటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ 9వ ఆవిర్భావ దినోత్సవాలు గుంటూరు నగరంపాలెంలోనున్న ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణప్రభు చేతుల మీదుగా మాతృశ్రీ అనాధ శరణాలయం విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చీఫ్ రీజనల్ కార్యదర్శి జయకుమార్ మాట్లాడుతూ సభ్యుల హక్కులను కాపాడటంతో పాటు జీతభత్యాలు పెంపు సంబంధిత అన్ని విషయాలకు వెన్నంటి ఉండి సభ్యుల అభ్యున్నతికి అసోసియేషన్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీఎమ్ రామ్‌ప్రసాద్, తారకేశ్వరరావు, సంఘ నాయకులు కోటిరెడ్డి, వీరాంజనేయులు, సునీల్, రతన్‌రాజ్, కళ్యాణ్, బషీర్ అహ్మద్, తదితరులున్నారు.

మోతడకలో పికిల్ హబ్

● రూ.20 కోట్లతో ఏర్పాట్లు
● పరిశీలించిన అధికారుల బృందం



మోతడకలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ సెంట్రల్ టీమ్ అధికారులు

తాడికొండ(మోతడక), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమల కింద మోతడక గ్రామంలో రూ.20 కోట్లతో పికిల్ హబ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించటానికి న్యూఢిల్లీ డీఆర్‌డీఏ సెంట్రల్ టీమ్ అధికారులు బుధవారం తాడికొండ మండలంలో పర్యటించారు. రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న మోతడకలో కామన్ ఫెసిలిటి సెంటర్ ఏర్పాటుకు ఎంఎస్ఎమ్ఈ ద్వారా ఎన్నార్ఎల్ఎం కింద పికిల్ హబ్ ఏర్పాటుకు నాలుగు ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ, కామన్ ఫెసిలిటి హబ్‌ను రూ. 20 కోట్లతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ నుంచి వచ్చిన అరవింద పటేల్ మాట్లాడుతూ రాజధాని అమరావతి చుట్టు పక్కల మిర్చి సాగు ఎక్కువగా ఉన్నదని, మిర్చి ద్వారా 120 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చనని తెలిపారు. అలాగే మామిడి, మిర్చి, గోంగూర, ఉసిరి కాయల ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో వలన పచ్చళ్ళ తయారు చేసి ఎగుమతులు చేసేందుకు హబ్‌గా నిర్మించటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. డ్వాక్రా సంఘాలు, రైతుల ద్వారా పచ్చళ్ళు, కారంపొడులు తయారు చేయించి మార్కెటింగ్ ద్వారా ఎగుమతులు చేయటం జరుగుతుందన్నారు. దీని ద్వారా డ్వాక్రా మహిళలు, రైతులకు ఆర్థికంగా భరోసా కల్పించటమే ప్రభుత్వం ఉద్దేశమని తెలిపారు. బండారుపల్లి, నిడుముక్కల గ్రామాల్లో డ్వాకా మహిళలు తయారు చేస్తున్న పచ్చళ్ళ, కారంపొడుల యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సెంట్రల్ టీమ్ అధికారులు జనార్ధన్‌రూట్, ఎన్ఐఆర్డీ హైదరాబాద్ నుంచి గోపాలకృష్ణ, స్టేట్ ఆఫీస్ సెర్ప్ లైవ్లీహుడ్ డైరెక్టర్ శివశంకర్‌ప్రసాద్, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మీ, ఏపీడీలు కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, పీ.ఈ శేఖర్, ఏపీఎం సాంబశివరావు, సర్పంచ్ శివపార్వతి, టీడీపీ నాయకులు కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి పార్వతి, తహసీల్దార్ మెహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీజేపీ శోభాయాత్ర

బాపట్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు బాపట్లలో ఘనస్వాగతం లభించింది. బుధవారం బాపట్లలో ఆయన పర్యటన నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు హాజరై శోభాయాత్ర విజయవంతం చేశారు. బీజేపీనాయకులు గజమాలలతో ఆయనను సత్కరించారు.



బాపట్లలో కార్యకర్తలతో భారీ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు మాధవ్

పూర్తయితే.. రాచ మార్గాలే..



● రూ. 930 కోట్లు మంజూరు చేసిన కేంద్ర జాతీయ రహదారుల శాఖ
● ఇప్పటికే వర్చువల్ విధానంలో పునాదిరాయి వేసిన మంత్రి గడ్కరీ
● వేగవంతంగా పనులు జరిగితేనే ప్రజలకు మేలు

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే శంకుస్థాపన చేసిన పనులు పూర్తి అయితే ఉమ్మడి జిల్లాలో అవి రాచమార్గాలుగా మారిపోతాయి. రవాణ వ్యవస్థ మెరుగుపడి ఆర్థికంగా ఊతమిస్తుంది. ముఖ్యంగా పోర్టులకు కనెక్టివిటీ పెరిగి లాజిస్టిక్ హబ్‌లుగా ఆయా ప్రాంతాలు తయారవుతాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఎన్‌హెచ్ అధికారులు అన్ని అనుమతులు తీసుకొని పనులు గ్రౌండింగ్ జరిగేలా చూడాలని మూడు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. రోడ్లలో ముఖ్యంగా జాతీయ రహదారులు బావుంటేనే అభివృద్ధికి అడుగులు పడతాయి. అంతేకాకుండా ప్రస్తుతం ఎక్కువగా జరుగుతోన్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా నిలుస్తాయి.

- ఎన్‌హెచ్ - 167ఏలో చిలకలూరిపేట - నకరికల్లు సెక్షన్ ఎంతో కీలకమైనది. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించి బఫర్ జోన్‌లు కూడా ఏర్పాటు చేస్తారు. మొత్తం 38 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేయనున్న ఈ ఎన్‌హెచ్‌కు రూ. 787 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ రోడ్డులో రెండు బైపాసులు, ఒక ట్రక్ లేబే, ఒక బస్ బే, 10 షెల్టర్లు, మూడు మేజర్, 10 మైనర్ బ్రిడ్జీలు, ఒక ఆర్‌వోబీ, ఇంటర్‌చేంజ్, మూడు వీయూపీలు, 51 కల్వర్టులు, ఒక టోల్ ప్లాజా, ఐదు జంక్షన్లు, 17 మైనర్ జంక్షన్లను అభివృద్ధి చేస్తారు. దీని వలన హైదరబాద్ నుంచి వోడరేవు, సూర్యలంక బీచ్‌లకు ప్రయాణ సమయం తగ్గుతుంది. అలానే కోటప్పకొండ, కొండవీడు పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది.
- ఎన్‌హెచ్ - 167 ఏడీలో మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాల బైపాస్‌లను 13 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ. 54 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో 9 మైనర్ జంక్షన్లు, 4.325 కిలోమీటర్ల పొడవునా ఆర్‌సీసీ డ్రెయిన్, 2.825 కిలోమీటర్ల పొడవునా పేవర్ బ్లాక్స్ వంటివి చేపడతారు. దీని వలన మాచర్ల, రెంటచింతల, గురజాలలో రద్దీ తగ్గుతుంది. అంతేకాకుండా ప్రయాణ వేగం పెరగడం, కాలూష్యం తగ్గడం జరుగుతుంది.
- ఎన్‌హెచ్-16లో చిలకలూరిపేట-విజయవాడ సెక్షన్ మధ్య 406+300 కిలోమీటర్(ఎల్‌హెచ్‌ఎస్) వద్ద మూడు వరసల ఆర్‌వోబీని అభివృద్ధి చేసేందుకు మంత్రి పునాదిరాయి వేశారు. కిలోమీటర్ పొడవునా నిర్మించనున్న ఈ ఆర్‌వోబీకి రూ. 29 కోట్లు మంజూరయ్యాయి. ఒక ఆర్‌వోబీతో పాటు మూడు కల్వర్టులు నిర్మిస్తారు. ప్రస్తుతం రెండు వరసల ఆర్‌వోబీ మాత్రమే ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది మూడు వరసలకు విస్తరించడం వలన బ్లాక్‌స్పాట్ తొలగిపోతుంది. అలానే ప్రయాణ వేగం పెరగుతుంది. ఎన్‌హెచ్-16లోనే 431+415 కిలోమీటర్(ఎల్‌హెచ్ఎస్) వద్ద మూడు వరసల ఆర్‌వోబీని రూ.60కోట్లతో కిలోమీటర్ పొడవునా నిర్మిస్తారు. దీని వలన కూడా మేజర్ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్ తొలగిపోతుంది.

ఘనంగా భూవరాహ స్వామి జయంతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సీతానగరం విజయ కీలాద్రిలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి మంగళ శాసనాలతో భూవరాహస్వామి జయంతి ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు భూవరాహ హోమం, అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి, వేద ఆశీర్వచనంతో మొదటి రోజు కార్యక్రమం వైభవంగా జరిగింది.

ప్రభుత్వానికి సహకరించాలి

● సినీ నటుడు సుమన్

తుళ్లూరు, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి) : అమరావతిలో రోడ్లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సినీ నటుడు సుమన్ అన్నారు. బుధవారం మందడంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. 11 భాషల్లో 800 సినిమాల్లో నటించిన తనకు అందరూ మద్దతుగా ఉండడం వల్లనే, ఈ స్థాయికి వచ్చానని అన్నారు. అమరావతిలో వన్‌బై వన్ అభివృద్ధి జరిగి సకల సౌకర్యాలతో ఉండబోతుందనే అభిప్రాయాన్ని సుమన్ వెల్లడించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం

పెదకాకాని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి మంగళగిరి వాస్తవ్యులు పలగాని నరసింహారావు, శివనాగేశ్వరమ్మ దంపతులు బుధవారం రూ.50వేలు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

9న టూల్ డౌన్ నిరసన

మంగళగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన మున్సిపల్ కార్యాలయాల వద్ద టూల్ డౌన్ నిరసన తెలియజేస్తున్నట్టు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. మంగళగిరి సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.36పై స్పష్టత ఇవ్వాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

పెదనందిపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(హెచ్‌ఈ)లో విద్యార్థుల సౌకర్యార్థం దాతలు కంప్యూటర్‌ను బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన శాఖమూరి శివన్నారాయణ జ్ఞాపకార్థం వారి భార్య సీతారత్నమ్మ కుమారుడు సత్యకృష్ణ, శిరీషా ఎన్నారైలు బహూకరించిన కంప్యూటర్‌ను టీడీపీ సీనియర్ నాయకులు బత్తిని వేణు హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో సీతారత్నం, హెచ్‌ఎం రూజ్‌వెల్ట్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి సమస్యను పరిష్కరించటమే ధ్యేయంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఫిరంగిపురంలోని అల్లంవారిపాలెం, ఎస్టీ కాలనీ, వసంతనగర్, ఆరోగ్యనగర్ కాలనీల్లో ఆయన ఇంటింటికి తిరిగారు. ఆయా కాలనీల్లో సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. వసంతనగర్‌లో రహదారి ఆక్రమణను వెంటనే తొలగింపచేయాలని స్థానిక అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్య



అల్లవారిపాలెంలో ఇంటింటికి ప్రదర్శనగా వెళ్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

క్షుడు మండవ నరసింహారావు, కటికల రామకోటేశ్వరరావు, కటికల అప్పారావు, కొండవీటి రాములు, రోశయ్య, పెరికల హృదయరాజు, నలజర్ల రవి కుమార్, శివయ్య, చంద్రశేఖర్, పసల థామస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించాలి

తాడికొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ గ్రామాల్లో ఖచ్చితమైన, అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించాలని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం గుంటూరు కలెక్టరేట్ డీఆర్‌సీ హాల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో పీ-4పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన బంగారు కుటుంబాలను గుర్తించటంతో పాటు, గ్రామాల్లోని వారు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆర్థికంగా స్థిరపడిన వారిని గుర్తించాలన్నారు. వారిని బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ఉండే విధంగా కృషి అధికారలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీ-4 నియోజకవర్గం ఇన్‌చార్జ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈపీవోఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాల అభివృద్ధికి ఒప్పందాలు

లాం(తాడికొండ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చలపతి ఫార్మసీ కళాశాల అభివృద్ధికి పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. బుధవారం లాం చలపతి ఫార్మసీ కళాశాల, కేరళకు చెందిన ఆస్పైర్ టెక్ పార్క్ మధ్య పారిశ్రామిక, విద్యా ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆస్పైర్ టెక్ పార్క్‌తో ఒప్పందాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధనలకు అనేక రంగాల్లో మౌళిక, శాస్త్రీయ, సాంకేతిక సహకారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆస్పైర్ టెక్ పార్క్ వ్యవస్థాపకురాలు లావణ్యశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిర్రావూరులో రూ.60లక్షలతో శ్మశాన వాటికలకు శంకుస్థాపన

తాడేపల్లి (చిర్రావూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ తన సొంత నిధులు రూ.60లక్షలతో చిర్రావూరులో రెండు శ్మశాన వాటికల మౌలిక సదుపాయాల కల్పనకు టీడీపీ స్థానిక నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. హిందూ, ముస్లిం శ్మశాన వాటికల చుట్టూ అంతిమ సంస్కారాల షెడ్డు, లాకర్, వెహికల్ షెడ్డు, గ్రీనరీ, గార్డెన్, రోడ్స్, లైటింగ్, బాత్రూమ్‌లు, వాటర్ ట్యాంక్ తదితర సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. మిగిలిన శ్మశాన వాటికలకు ప్రహరీల నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌కు గ్రామస్థులు, స్థానిక నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించిన ఎంపీడీవోల బృందం

ప్రత్తిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపాలెంలో ఉన్న సుప్రిమ్ ఎల్‌టీసీ (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్డులో బుధవారం హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ట్రైనింగ్‌కు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలు డిప్యూటీ ఎంపీడీవోలు హాజరయ్యారు. వీరిని ఆరు గ్రూపులుగా విభజించి తుమ్మలపాలెంలో క్లాప్ మిత్రాలతో కలిసి డోర్‌టూడోర్ పర్యటన నిర్వహించారు. ముందుగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద నున్న గాంధి విగ్రహానికి జడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్‌లతో పాటు అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఎం చంద్రబాబుకు ఎంపీపీ జబీన్ కృతజ్ఞతలు

దుగ్గిరాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హజ్‌యాత్రను సఫలం చేసుకున్న 71మందికి ఒక్కొకరికీ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం మంజూరు చేసి నందుకుగానూ సీఎం చంద్రబాబు నాయుడుకు హజ్ కమిటీ రాష్ట్ర సభ్యురాలు, ఎంపీపీ జబీన్ కృతజ్ఞతలు తెలిపారు. హజ్‌కమిటీ సభ్యులను వెంటబెట్టుకుని, ముఖ్యమంత్రిని సెక్రటేరియట్‌లో కలిసి మొక్కను అందించి ధన్యవాదాలు తెలిపినట్టు ఆమె బుధవారం ఓ ప్రకటనలో చెప్పారు.



సీఎం చంద్రబాబుకు మొక్కను అందజేస్తున్న హజ్‌కమిటీ రాష్ట్ర సభ్యురాలు, ఎంపీపీ షేక్ జబీన్

స్కేటర్ జెస్సీరాజ్‌కు మంత్రి అభినందన

మంగళగిరి సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ మాత్రపు జెస్సీరాజ్‌ను ఏపీ రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అభినందించారు. బుధవారం ఏపీ క్రీడల మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జెస్సీరాజ్‌ను ఘనంగా సత్కరించిన మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించి ఏపీకి మంత్రి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.



జెస్సీరాజ్‌ను అభినందిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

చిరువ్యాపారులకు మంత్రి లోకేశ్ చేయూత

మంగళగిరిసిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణం, మండలంలోని చిరువ్యాపారులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చేయూత నందించారు. మంగళగిరి టిడ్కో సముదాయానికి చెందిన రాజనాల కోటేశ్వరమ్మకు బడ్డీకొట్టు, ఆత్మకూరు గ్రామానికి చెందిన మంద్రు శివలక్ష్మికి తోపుడు బండిని అందజేశారు. స్థానిక నేతల ద్వారా లబ్ధిదారులకు బడ్డీ కొట్టు, తోపుడు బండిని బుధవారం అందజేయించారు.



కోటేశ్వరమ్మకు బడ్డీ కొట్టు అందజేసిన టీడీపీ నాయకులు

నిర్దేశిత కాలంలో బీమా ప్రీమియం చెల్లించాలి

● ఏవో సుధాకర్

కాకుమాను, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఈ నెల 15 వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని రైతులు ఆ పథకం ప్రీమియం నిర్దేశిత కాలంలో చెల్లించి పంటల బీమా ప్రయోజనాలు పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. మండలపరిధిలోని బోడిపాలెం, కోతివానిపాలెం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

● పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ చిరుమామిళ్ళ నరసింహారావు

వట్టిచెరుకూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వెన్నుదన్నుగా, సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వట్టిచెరుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన ఛైర్‌పర్సన్ చిరుమామిళ్ళ నరసింహారావు రైతులకు, అధికారులకు హామీ ఇచ్చారు. వట్టిచెరుకూరు గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం ఛైర్‌పర్సన్‌గా చిరుమామిళ్ళ నరసింహారావు స్వీకరించారు. అలాగే పర్సన్స్‌గా ఎండ్రపాటి సముద్రాలు, ధూపాటి వీరయ్యలతో సొసైటీ సెక్రటరీ మధు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, ఆత్మీయులు, పలువురు టీడీపీ నాయకులు చిరుమామిళ్ళ నరసింహారావును పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా చిరుమామిళ్ళ నరసింహారావు పర్సన్‌లను ఏజీఎం కే బాలాజీ ప్రసాదు, జనరల్ మేనేజర్ పీ రమాదేవి, సూపర్‌వైజర్, పీ శివన్నారాయణలు బొకేలు అందజేసి రైతుల కోసం సొసైటీ పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షులు కొత్తపల్లి తిరుపతిరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ జెట్టి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మర్రి సాంబశివరావు, పూనాటి రమేష్, మూల్పూరి రాజేంద్ర ప్రసాదు, అనంతవరప్పాడు సర్పంచ్ దారా వెంకటరావు, సీఐ రమానాయక్, టీఎస్ఎఫ్ నాయకులు మన్నవ వంశీ, చిరుమామిళ్ళ మల్లి, ముట్లూరు ఎంపీటీసీ గోగినేని కళ్యాణ్ తదితరులు అభినందించారు.



పీఏసీఎస్ ఛైర్‌పర్సన్, పర్సన్లను అభినందిస్తున్న ఏజీఎం కే బాలాజీ ప్రసాదు, మేనేజర్ పీ రమాదేవి, సూపర్‌వైజర్ శ్రీమన్నారాయణలు

మాజీ జడ్పీటీసీ యడ్ల వెంకట్రావుకు ఘననివాళి

దుగ్గిరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో పదవుల కోసం కాకుండా ప్రజాసేవలో తనదైన ముద్రవేసుకుని, మచ్చలేని నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, పలువురు మాజీ జడ్పీటీసీ యడ్ల వెంకట్రావు సేవలను స్మరించారు. గత నెల 27న వెంకట్రావు మృతి చెందిన విషయం విదితమే. చిలువూరు గ్రామంలోని స్వగృహంలో బుధవారం జరిగిన వెంకట్రావు పెద్దకర్మకు పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు హాజరై నివాళులర్పించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, బయోఫర్ సీఈవో డాక్టర్ రంగిశెట్టి జగదీశ్ బాబు, డాక్టర్ రమేష్ బాబు, మంగళగిరి యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ పరిశీలకుడు ఎం సత్యనారాయణ, అరుణ్, వైసీపీ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, మున్నంగి గోపిరెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజ కుమారి, సీపీఎం సీనియర్ నాయకుడు మధు, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణ ప్రసాద్, గూడూరు వెంకట్రావు, కేసంనేని శ్రీఅనిత, వెనిగళ్ల, గూడూరు వెంకట్రావు, తాళ్ల అశోక్, యేళ్ల జయలక్ష్మి, పాటి బండ్ల కృష్ణప్రసాద్, పాటిబండ్ల హరిప్రసాద్, తోటకూర సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



యడ్ల వెంకట్రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎన్నారై డాక్టర్ యడ్ల హేమప్రసాద్ తదితరులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పీ-4 సర్వేని వేగవంతం చేయండి

● మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతిరావు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టంలో పీ-4 సర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక పురపాలక సంఘం మెప్మా షెడ్‌లో మున్సిపల్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి అర్బన్ పరిధిలో పీ-4 సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ తుమ్మల శివన్నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక చినరావూరు 13వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు పరిసరాల పరిశుభ్రతలను పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

22న సామూహిక కుంకుమార్చన

పొన్నూరు టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని ఈ నెల 22వ తేదీన సహస్రలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారి ఉపాలయం వద్ద ఉచిత సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జీవీ అమర్నాథ్ బుధవారం తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఆలయంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని వాసు మిత్రమండలి సభ్యులు నిర్వహించారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి కార్యాలయం వద్ద గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవి జన్మదినం సందర్భంగా వాసు మిత్రమండలి సభ్యులు పేద ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బోయిన వాసు, గ్యాలం వేణు, కుర్రా శ్రీను, నన్నపనేని రాంబాబు, కోటా అక్కేశ్వరావు, షేక్ దావూద్, అబ్దుల్లా, కొనసా రాంబాబు, ఉమానాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

● నియోజకవర్గ కార్యదర్శి పుష్పాల

పొన్నూరు టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుష్పాల సత్యనారాయణ కోరారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో బుధవారం సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీలలో గుంటూరులోని కొత్తపేట మల్లయ్య లింగం భవనంలో సీపీఐ 26వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 17వ తేదీన బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి ప్రదర్శన జరుగుతుందన్నారు. 18వ తేదీన ప్రతినిధులు సభ ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రామారావు, సీపీఐ నాయకులు ఏడుకొండలు, గోవిందరాజులు, ఎం.సత్యనారాయణ, కూచిపూడి రత్నబాబు, రాఘవులు, సీతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగం వద్దు

● ఏవో వెంకటేశ్వరావు

పొన్నూరు టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగం చేపట్టవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.వెంకటేశ్వరావు అన్నారు. మండల పరిధిలోని మన్నవ, దొప్పలపూడి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించింది. గ్రామాల్లో వెద వరి సాగు పైర్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయశాఖ సిబ్బంది, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు పాల్గొన్నారు.


బియ్యం పంపిణీ చేస్తున్న పాస్టర్లు

పాస్టర్లకు బియ్యం పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ముత్తింశెట్టిపాలెంలోని ఏసుక్రీస్తు ప్రార్థన గోపురంలో బుధవారం పాస్టర్లకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. టౌన్ పాస్టర్ గ్రేట్ సపోర్టు ఫుల్ హెల్పింగ్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. బ్రదర్ ఆనందన్న మాట్లాడుతూ, క్రీస్తుసేవ చేస్తున్న పాస్టర్ల సంక్షేమం కోసం అసోసియేషన్ తోడ్పడుతుందన్నారు. రమేష్‌బాబు, దానియేలు, ఇస్రాయేలు, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డీఎస్పీ కార్యాలయ రహదారి



- రోడ్డుపై నిత్యం వందలాది మంది రాకపోకలు
- గులకరాళ్లు, డస్ట్‌తో ఇక్కట్లు
- వర్షం కురిస్తే రాకపోకలకు అవస్థలు
- ఇదేమార్గంలో ఇరిగేషన్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు
- సమస్యను పరిష్కరించాలని పలువురి వేడుకోలు

గులకరాళ్లు లేచి ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు


డీఎస్పీ కార్యాలయం ఎదుట అధ్వానంగా ఉన్న రహదారి

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ డివిజన్‌వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ అధికారి కార్యాలయానికి వెళ్లే రహదారి అది. రైతులు లక్షలాది ఎకరాలకు సాగునీరు పారుదల కాల్వల పర్యవేక్షణ అధికారి కార్యాలయాల కూడా ఇదే మార్గం. పేరుకు ఉన్నతాధికారుల కార్యాలయ భవనాలు ఉన్నా వాటికి చేరుకోవాలంటే ప్రజలకు నరకప్రాయంగా మారుతోంది. పధానంగా కార్యాలయాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఒక పక్క ప్రవహించే పడవల కాలువ మధ్యలో రోడ్డు అవతల పక్క ఈ కార్యాలయాలతో ఆహ్లాదకర వాతావరణం ఉండగా ఆ రోడ్డు మాత్రం గులకరాళ్లు తేలి, కుంగిపోయి గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉంది. సబ్ డివిజన్ వ్యాప్తంగా అనేక కేసుపై పోలీసు అధికారులు డీఎస్పీని సంప్రదించాలంటే వాహనాలతో కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా కేసుల్లోని బాధితులుకు పోలీస్ స్టేషన్‌లో సమస్యలు తలెత్తుతే నేరుగా డీఎస్పీని కలిసేందుకు కూడా ఈ మార్గంలోనే రావాల్సి ఉంది. సబ్‌డివిజన్ వ్యాప్తంగా నేర నియంత్రణపై ఎస్పీ, ఉన్నతాధికారులు సైతం డీఎస్పీ కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు సాగునీటి సమస్యలు కాల్వల మరమ్మతులు వంటి సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కారానికి కృషి చేయాలని కోరేందుకు ఈ రహదారిపైనే రాకపోకలు జరుగుతాయి. అంతే కాకుండా ఇదే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ కూడా ఉంది. దీనికి కూతవేటు దూరంలోనే సబ్‌డివిజన్ వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయం కూడా ఉంది. ఇందరు వినియోగించుకునే రోడ్డు అలనాపాలనకు నోచుకోక అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం ఆ రోడ్డు రూపురేఖలు కోల్పోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు వాడిన గులకరాళ్ళు, డస్ట్ ఇతర మెటీరియల్ రోడ్డునుంచి విడిపోయి గులకరాళ్లు రోడ్డు అంచుకు చేరి వాహన దారులు వెళ్తూ అదపుతప్పి కిందపడి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. పక్కన కాలువ ప్రవహిస్తుండటంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. ప్రతిరోజు వందలాదిగా ప్రయాణించే ఆ రోడ్డుపై ప్రభుత్వం దృష్టి పెట్టి ప్రజలందరికీ ఉపయోగపడేలా నూతన రోడ్డును ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్


కొల్లిపర ప్రభుత్వ వ్యతిరేక విధానాల గురించి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో పేద ప్రజలను అన్నివిధాల మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో వైసీపీ నాయకులు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేయని పథకాల గురించి ప్రజలకి వివరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాల కారణంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వంపై పూర్తిగా వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్ళం వెంకటప్ప రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మాజీ జెడ్పీటీసి భట్టిప్రోలు వెంకటలక్ష్మి, యూత్ అధ్యక్షుడు ఈదా యశ్వంత్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బ్రీతింగ్ టెస్టును నిర్వహిస్తున్న సీఐ రమేష్‌బాబు తదితరులు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

● సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం సుల్తానాబాదులో త్రీటౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు సిబ్బందితో కలసి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి బ్రీతింగ్ టెస్టులను చేశారు. వీరిలో పలువురు మద్యం సేవించి ఉండటాన్ని గుర్తించారు. సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. దీనివలన వలన ప్రమాదాల బారినపడే అవకాశముందన్నారు. గతంలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపినవారే అధికంగా ఉన్నారన్నారు. అతిగా మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మారీసుపేటలోని సీఎం కాలనీలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడిచేసి నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.3వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆడిట్ బృంద సభ్యుడు రామాంజనేయులు

ఐఎస్‌వో సర్టిఫికెట్ కోసం ఆడిట్ బృందం సమావేశం

తెనాలి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఐఎస్‌వో సర్టిఫికెట్‌పై ఆడిట్ బృంద సభ్యులు రామాంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా, ఆఫీసులో రికార్డులు నిర్వహించే విధానం వంటివాటిపై అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, మండలంలోని వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పాటలతో సమాజాన్ని జాగృతం చేసిన గద్దర్

● అక్కిదాసు కిరణ్‌కుమార్


గద్దర్, చుండూరు మృతుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

తెనాలి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని రుగ్మతలను తన పాటలతో ఎండగడుతూ ప్రజలను నిరంతం జాగృతం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ చెప్పారు. బుధవారం దివంగత గుమ్మడి విఠల్‌రావు (గద్దర్) ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి, చుండూరు మృతుల వర్ధంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

దశావతార వెంకన్నస్వామికి ప్రత్యేక పూజలు

పెదకాకాని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీదశావతార వెంకన్నస్వామి దివ్య క్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా బుధవారం పెద్దఎత్తున భక్తులు ఆలయాన్ని దర్శించారు. స్వామివారి దేవస్థానంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శ్రావణపట్టీ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.


దశావతార వెంకన్నస్వామిని దర్శించుకున్న భక్తులు

అణ్వస్త్ర ఆయుధాల వినియోగానికి 80 ఏళ్లు

● ఐకా బాలాజీ


అణ్వస్త్ర విధ్వంసాన్ని వివరిస్తున్న బాలాజీ

తెనాలి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అణ్వస్త్ర ఆయుధాలు వినియోగించి 80ఏళ్లు పూర్తయిందని, ముందడుగు వైజ్ఞానిక సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఐకా బాలాజీ చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం అణ్వస్త్ర అంశాలపై అవగాహన కల్పించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా 1945, ఆగస్టు 6న అణుబాంబులు వేసిందన్నారు. మూడున్నర లక్షలమంది మరణించగా, ఎన్నో దశాబ్దాల పాటు అణుధార్మికత వలన ప్రజలకు కొత్త రోగాలు, శారీరక, మానసిక వైకల్యంతో నరకం అనుభవించారని చెప్పారు. ఒక దేశాధినేత నియంతృత్వ నిర్ణయానికి అయామకులైన పిల్లలు, వృద్ధులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా మానవాళికి పెనుముప్పుగా మానవత్వానికి పెనుమచ్చగా మిగిలిందన్నారు. మళ్లీ అణుయుద్ధాలు పునరావృతం కాకుండా ప్రజలు చైతన్యవంతమై అణ్వస్త్ర నిరోధానికి నడుం కట్టాలని కోరారు. 35ఏళ్లుగా 500లకు పైగా ప్రదర్శనలు ఇస్తున్నామని చెప్పారు. అణ్వస్త్ర ఆయుధాలతో వాటిల్లే నష్టాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న బాలాజీ, నిర్మలను ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, రామరాజు, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50వేల విరాళం

పెదకాకాని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి మంగళగిరికి చెందిన పలగాని నరసింహారావు, శివనాగేశ్వరమ్మ దంపతులు బుధవారం రూ.50,000లు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. సందర్భంగా లీలాకుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు.

తక్కెళ్లపాడు సొసైటీకి ఉత్తమ సేవా పతకం


మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న తక్కెళ్లపాడు సొసైటీ కార్యదర్శి నిమ్మగడ్డ శ్రీనివాసరావు

పెదకాకాని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తక్కెళ్లపాడు సొసైటీకి ఉత్తమ సేవ పతకం లభించింది. ఈ మేరకు విజయవాడలో బుధవారం జరిగిన ఆప్కాబ్ 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంనకు అవార్డు దక్కాయి. తక్కెళ్లపాడు పీఏసీఎస్‌కు 2024-25లో రైతులకు మెరుగైన సేవలు, ఆర్థికంగా లాభాలు ఆర్జించినందుకు అవార్డు, ప్రశంసాపత్రంతో మంత్రి సత్కరించినట్లు సొసైటీ కార్యదర్శి నిమ్మగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ గన్ని వీరాంజనేయులు, సొసైటీ ఉద్యోగులు రవితేజ పాల్గొన్నారు.


వల్లభాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి

● మండల వైద్యాధికారి నీహ

కొల్లిపర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతినెల వైద్యపరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు మందులను వాడుకోవాలన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ నాగమణి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఏఎన్ఎం జ్యోతి, ఆషా కార్యకర్తలు శాంతి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ వెంకటేశ్వరావు, తదితరులు

ఆక్రమణలను తొలగించండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక నందులపేటలోని 4వ వార్డులో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రెయిన్లను ఆక్రమించి ర్యాంపులను నిర్మించవద్దన్నారు. సిల్ట్ నిలిచి మురుగునీటి పారుదలకు అడ్డంకులు ఏర్పడతాయన్నారు. స్వచ్ఛ తెనాలికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ ఎ.వెంకటేశ్వరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ఏసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీంద్రబాబు

దీర్ఘకాలిక పసుపు రకాలను ఎంచుకోవాలి

● జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీంద్రబాబు

కొల్లిపర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు దీర్ఘకాలిక పసుపు రకాలను ఎంచుకోవడం వలన అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీంద్రబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో ఉద్యాన శాఖాధికారులు, శాస్త్రవేత్తలు పసుపు సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పసుపు సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ పసుపును విత్తనశుద్ధి చేయడం వలన దుంపకుళ్లు రాకుండా నివారించుకోవచ్చునన్నారు. శాస్త్రవేత్త తనూషా ప్రియ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పసుపులో అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నాగలక్ష్మి, మండల ఉద్యాన శాఖాధికారి శ్రీనిత్య తదితరులు పాల్గొన్నారు.